


https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY

సంపుటి 10 | సంచిక 55 | కర్నూలు | శుక్రవారం 21 మార్చి 2025 | పేజీలు : 08 | వెల రూ. 5.00

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi




# దొంగల్లాగా రావాల్సిన అవసరమేముంది


**దొంగతనంగా సంతకాలు చేసి వెళితే ఎలా**
**సభకు రాకుండా..సంతకాలు చేయడం సబబేనా**
**ప్రజలు ఎన్నుకుంది ఇందుకేనా?**
**అసెంబ్లీలో వైకాపా సభ్యుల తీరుపై స్పీకర్ అసహనం**




అమరావతి,మార్చి20((శ్రీచక్ర): వైకాపాకు చెందిన ఎమ్మెల్యేలు శాసనసభకు రాకుండా సంతకాలు చేస్తుండటంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైకాపా ఎమ్మెల్యేలు సభకు హాజరవడం మీరెవరైనా చూశారా? అంటూ సభ్యులను స్పీకర్ ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన సభ్యులు సభకు సగౌరవంగా హాజరుకావాల్సి ఉందన్నారు. వైకాపా సభ్యులు ఎవరికీ కనపడకుండా దొంగచాటుగా వచ్చి రిజిస్టర్‌లో సంతకాలు చేయాల్సిన పనేముందని అసహనం వ్యక్తం చేశారు. అలా వచ్చి వెళ్లడం వారి గౌరవాన్ని పెంచదన్నారు. ఎన్నికైన వారు సభకు రావాలి. ప్రజల సమస్యలపై చర్చించాలి. ప్రజలు ఎన్నుకుందే అందుకు అని గుర్తించాలని స్పీకర్ అన్నారు. ఈ మేరకు అసెంబ్లీలో సభ్యుల హాజరుపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు కీలక ప్రకటన చేశారు. ఈ సమావేశంలో 25 ప్రశ్నలకు సమాధానాలు రాలేదని అన్నారు. ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నలు వేయడం వల్ల మరో ఇద్దరు మెంబర్లు అడగడానికి ఇబ్బంది వస్తోందన్నారు. ఇది సమంజసం కాదని.. ప్రశ్నలు అడగడానికి వారు సభలో ఉండడం లేదని.. ఇది చాలా దురదృష్టకరమని అన్నారు. సభ్యులు సభకు రావాలని, ప్రజా ప్రతినిధులుగా ఎన్నికయిన సభ్యులు సగౌరవంగా సభకు రావాలని సూచించారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ సభ్యుల తీరుపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పార్టీ సభ్యులు దొంగల్లా సభకు వస్తున్నారని, సంతకాలు పెట్టి వెళుతున్నారని మండిపడ్డారు. ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. రిజిష్టర్‌లో సంతకాలు చేసిన వారు సభలో తనకు కనిపించలేదని అయ్యన్న పాత్రుడు అన్నారు. ప్రజా ప్రతినిధులుగా ప్రజలు మిమ్మల్ని ఎన్నుకున్నారని, మొఖం చాటేయడం ఎందుకని సభాపతి అయ్యన్న వైఎస్సార్‌సీపీ సభ్యులను ఉద్దేశించి ప్రశ్నించారు. దొంగల్లా వచ్చి సంతకాలు చేసి వెళ్లడం ఏంటన్నారు. హాజరు పట్టికలో సంతకాలు చేసి సభకు రాకపోవడం వారి గౌరవాన్ని పెంచదన్నారు. వై బాల నాగిరెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్, రేగం మత్స్యలింగం, విరూపాక్షి, దాసరి సుధ, అమరనాధ రెడ్డి, విశ్వేశరరాజులు తదితరులు ఇలా సంతకాలు చేసి వెళ్లిపోతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగం తరువాత వేర్వేరు రోజుల్లో వారు సంతకాలు చేసి వెళ్లినట్టు- తెలుస్తోందన్నారు. మీకు ఓట్లేసిన ప్రజలకు ఇలా చేసి తలవంపులు తేవద్దని కోరుతున్నామని అయ్యన్న పాత్రుడు అన్నారు. దొంగల్లా వచ్చి సంతకాలు పెట్టాల్సిన అవసరం వైఎస్సార్‌సీపీ సభ్యులకు లేదని, వారు గౌరవంగా సభకు వచ్చి మాట్లాడవచ్చు కదా అని స్పీకర్ అయ్యన్న అన్నారు. ప్రశ్నలు అడిగి కొంతమంది సభ్యులు సభలో లేకుండా వెళ్లిపోతున్నారని, దీని వలన అసలు ప్రశ్నలు అడగాల్సిన సభ్యులు అవకాశం కోల్పోతున్నారని ఆయన అన్నారు. ఇటువంటి సంప్రదాయం మంచిది కాదన్నారు. అటెండెన్స్ రిజిష్టర్‌లో సంతకాలు చేసిన 7 గురి ఎమ్మెల్యేల పేర్లను సభాపతి అయ్యన్న పాత్రుడు సభలో చదివి వినిపించారు.

# ఎస్సీల్లో బుడగజంగం కులం చేరిక

**ఏపీ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం...కేంద్రానికి నివేదిక**
**దళితులకు పెద్దపీట వేసిన ఘనత టీడీపీదన్న బాబు**



అమరావతి,మార్చి 20((శ్రీచక్ర) బుడగజంగం కులాన్ని ఎస్సీలో చేర్చాలంటూ చేసిన తీర్మానాన్ని ఏపీ అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. శాసనసభ తీర్మానాన్ని కేంద్రానికి పంపనున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని గతంలోనే చెప్పాం.. ఆ మాట నిలబెట్టుకుంటున్నామని చంద్రబాబు అన్నారు. దళితులకు పెద్దపీట గతంలో వేశామని, ఇప్పుడూ అందుకు కట్టుబడి పనిచేస్తున్నా మని వెల్లడించారు. లోక్‌సభ స్పీకర్‌గా బాలయోగిని, అసెంబ్లీ స్పీకర్‌గా ప్రతిభా భారతిని చేశామని, ఆ ఘనత తెలుగుదేశం పార్టీదని అన్నారు. అసెంబ్లీలో ఆయన ఎస్సీ వర్గీకరణపై మాట్లాడారు. అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపితే సమన్య పరిష్కారం అవుతుందని గతంలోనే చెప్పాను. జిల్లాల వారీగా కేటగిరి విభజన చేయాల్సి ఉంటుంది. జనగణన తర్వాత మరోసారి జిల్లాల వారీగా కేటగిరిల విభజన చేసేందుకు సిద్ధంగా ఉన్నాం అన్నారు. ఏబీసీడీ కేటగిరి విభజన కోసం 1996లో కమిటీ- వేశాం. ఉమ్మడి ఏపీలో రేషనలైజేషన్, కేటగిరిలపై 2000 సంవత్సరంలో చట్టం చేశాం. ఆ చట్టాన్ని కోర్టు కొట్టివేసింది. ఎస్సీ వర్గీకరణ జరగాల్సిందే నని ఉషా మెహ్రా కమిషన్ నివేదిక ఇచ్చింది. స్థానిక సంస్థల్లో కల్పించాల్సిన రిజర్వేషన్లపై కూడా కమిటీ- అధ్యయనం చేసింది. ఎస్సీ వర్గీకరణ సాకారం కావడంలో నా ప్రయాణం కూడా సుదీర్ఘంగా సాగింది. మొదట కమిటీ- వేసినప్పటి నుంచి సుప్రీంకోర్టు తీర్పు వచ్చేవరకు ఉండటం నా అదృష్టం. సామాజిక న్యాయం కోసం (మిగతా 8లో )

# ఎస్సీవర్గీకరణ హీరోలు మందకృష్ణ, చంద్రబాబు

**వారిద్దరి వల్లనే వర్గీకరణకు న్యాయం దక్కింది**
**మందకృష్ణ గుండె ధైర్యంతో మాదిగలకు బలం**
**ఎస్సీవర్గీకరణ చర్చలో పవన్ కళ్యాణ్**



అమరావతి,మార్చి 20((శ్రీచక్ర):ఎస్సీ వర్గీకరణ ఈ స్థాయి వరకు వచ్చిందంటే మందకృష్ణ మాదిగ, ఏపీ సీఎం చంద్రబాబు కారణమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాదిగ అని చెప్పగలిగే గుండె ధైర్యం కలిగిన వ్యక్తి మందకృష్ణ. ఆ కులానికి వన్నె తెచ్చిన ఆయనను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని చెప్పారు. ఎస్సీ వర్గీకరణపై చాలా చర్చలు జరిగాయి. గుర్తింపు లేని కులాలపైనా విస్తృతంగా చర్చలు జరిగాయి. సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టి రాజీవ్ రంజన్ మిశ్రాతో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేశారు. కమిషన్ ఇచ్చిన నివేదిక చాలా అద్భుతంగా ఉంది. ఇది అందరికీ మేలు చేస్తుందని ఆశిస్తున్నట్లు పవన్ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణ చేసిన చంద్రబాబుకు పవన్ కల్యాణ్ ధన్యవాదాలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణతో అందరికీ మేలు జరుగుతుందని ఆశిస్తున్నట్లు- ఆయన తెలిపారు. మాదగ కులానికి వన్నె తెచ్చిన మందకృష్ణకు ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై చాలా చర్చలు జరిగాయని ఆయన పేర్కొన్నారు. అసమానతలపై ఇంకా పోరాటం చేయాల్సి ఉందన్నారు. సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. వర్గీకరణపై ఇచ్చిన మాట సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారని అన్నారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ.. కమిషన్ నివేదిక ప్రకారం జిల్లాల వారీగా దామాషా ప్రకారం రిజర్వేషన్ విధానం అమలు చేయాలని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు చొరవతో దళితులు అగ్రపథాన నిలిచారని గుర్తు చేశారు. దళిత వాడల్లో సంపద సృష్టి జరిగిందని వివరించారు. 800 ఎకరాలు దళితుల భూములు ఇడుపులపాయ ఎస్టేట్‌లో జగన్‌రెడ్డి కుంటుంబం ఆక్రమించుకుందని ఆయన ఆరోపించారు. టీడీపీ మరో ఎమ్మెల్యే కొండ్రు మురళీ మోహన్ మాట్లాడుతూ.. జగన్ మోహన్ రెడ్డి హయాంలో ఎస్సీలకు సంబంధించిన అనేక పథకాలను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ కోసం టీడీపీ మొదటి నుంచీ కట్టు-బడి ఉందని ఆయన గుర్తు చేశారు. అంతకుముందు ఎస్సీ వర్గికరణపై ఏక సభ్య కమిషన్ నివేదికను మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి ఉభయ సభల ముందు ప్రవేశపెట్టారు. దీనిపై స్వల్పకాలిక చర్చ జరిగింది. అందులోభాగంగా ఈ అంశంపై సీఎం చంద్రబాబు నాయుడితోపాటు- డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ తదితరులు సభలో మాట్లాడారు.

# చిరంజీవికి యూకె పార్లమెంట్ సన్మానం

**లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పుస్కారం అందచేత**
**చిరుకు తమ్ముడిగా పుట్టినందుకు గర్విస్తున్నా**
**అన్నయ్యకు అభినందనలు తెలిపిన పవన్ కళ్యాణ్**

హైదరాబాద్,మార్చి20((శ్రీచక్ర)ప్రముఖ నటుడు చిరంజీవిని హౌస్ ఆఫ్ కామన్స్ యూకే పార్లమెంట్‌లో ఘనంగా సత్కరించారు. లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారాన్ని ఆయనకు ప్రదానం చేశారు. నాలుగున్నర దశాబ్దాలుగా సినిమాల ద్వారా కళారంగానికి, సమాజానికి చేసిన సేవలకుగానూ చిరంజీవికి ఈ గౌరవం దక్కింది. యూకే అధికార లేబర్ పార్టీ ఎంపీ నవేందు మిశ్రా ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది. పార్లమెంట్ సభ్యులు సోజన్ జోసెఫ్, బాబ్ బ్లాక్‌మాన్ తదితరులు పాల్గొన్నారు. దీనికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు వైరల్ అవుతున్నాయి. గతేడాది.. చిరంజీవికి గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు, ఏయన్నార్ జాతీయ పురస్కారం, ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ (ఐఫా)- 'అవుట్ స్టాండింగ్ అఛీవ్‌మెంట్ ఇన్ ఇండియన్ సినిమా' గౌరవం దక్కిన సంగతి తెలిసిందే. 156 సినిమాలు, 537 పాటలు, 24 వేల స్టెప్పులతో ప్రేక్షకులను విశేషంగా అలరించినందుకు ఆయన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. అక్కినేని నాగేశ్వరరావు శత వసంతాల వేడుకల్లో భాగంగా ఆ అవార్డును స్వీకరించారు. గతేడాదే.. దేశంలో రెండో అత్యున్నతమైన పద్మ విభూషణ్ పురస్కారాన్ని అందుకున్నారు. యూకే పార్లమెంట్‌లో ఘనంగా సత్కరించిన విషయం తెలిసిందే. సినీ, సేవా రంగాల్లో విశేష కృషి చేసిన చిరంజీవికి జీవిత సాఫల్య పురస్కారం అందించింది. చిరుకు ఈ పురస్కారం రావడంపై పవన్‌కల్యాణ్ ఆనందం వ్యక్తంచేశారు. ఆయనకు తమ్ముడిగా పుట్టినందుకు గర్వంగా ఉందన్నారు. ఈ పురస్కారం చిరంజీవి కీర్తిని మరింత పెంచిందన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. సాధారణ మధ్యతరగతి ఎక్సైజ్ జ్ కానిస్టేబుల్ కుమారుడిగా జీవితం మొదలుపెట్టి.. స్వశక్తితో, కళామతల్లి దీవెనలతో మెగాస్టార్‌గా ఎదిగారు. నాలుగున్నర దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా అభిమానులను అలరిస్తున్నారు. ఎన్నో అవార్డులు సొంతం చేసుకున్నారు. ఆయనకు తమ్ముడిగా పుట్టినందుకు ఎప్పుడూ గర్వంగా ఉంది. ఆయన్ని అన్నయ్యగా కంటే తండ్రి సమానుడిగా భావిస్తాను. నేను జీవితంలో ఏం చేయాలో తెలియక, అయోమయం లో ఉన్న పరిస్థితుల్లో నాకు మార్గం చూపించిన వ్యక్తి మా అన్నయ్య. నా జీవితానికి హీరో చిరంజీవి.




# వరుషికొండ భవనాలపై ఆలోచన చేస్తున్నాం

**ఏపీ సద్దాంగా ఊహించుకున్న జగన్**
**అందుకే 700 కోట్లతో భవనాల నిర్మాణం**
**జగన్‌పై మంత్రి లోకేశ్ విమర్శలు**




విజయవాడ,మార్చి20((శ్రీచక్ర): వైసీపీ నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తనను తాను ఏపీ సద్దాం హుస్సేన్ గా ఊహించుకున్నారని మంత్రి లోకేశ్ మండిపడ్డారు.. 30 ఏళ్ల పాటు- పదవిలో కొనసాగుతానని కలలు కన్నారంటూ లోకేష్ ఎద్దేవా చేశారు. రుషికొండలో నిర్మించిన విలాసవంతమైన ప్యాలెస్ పై స్పందిస్తూ.. పైవిధంగా వ్యాఖ్యానించారు. రుషికొండ ప్యాలస్ గురించి నారా లోకేష్ మాట్లాడుతూ.. 'తొలుత ఇది ఏపీ ప్రభుత్వ పర్యాటక శాఖ ప్రాజెక్ట్.. తర్వాత అది శిశ్ మహల్ గా మారింది. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తనను తాను ఏపీ సద్దాం హుస్సేన్ గా భావించారు. అందుకే మరో 30 ఏళ్ల పాటు తానే పదవిలో ఉంటానని నమ్మి.. అంత విలాసవంతమై భవనాన్ని నిర్మించారని చెప్పుకొచ్చారు. లోకేష్ మాట్లాడుతూ.. 'మా తాత, నాన్న ఇద్దరు ముఖ్యమంత్రులగా పని చేశారు. కానీ వారి హయాంలో నేను ఇంత విలాస వంతమైన భవనాన్ని, ఇంత పెద్ద గదులను చూడలేదు. శిశ్ మహల్ నిర్మాణం కారణంగా పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ రాష్ట్ర ప్రభుత్వం మీద 200 కోట్ల రూపాయల జరిమానా విధించింది' అని తెలిపారు. 'వైసీపీ అధ్యక్షుడిది చాలా చిన్న కుటుంబం. ఆయన తల్లి, సోదరిలను కుటుంబం నుంచి పంపించి వేశారు. ప్రస్తుతం ఆయన, భార్య, పిల్లలు మాత్రమే ఉన్నారు. కేవలం నలుగురు కుటుంబ సభ్యుల కోసం 700 కోట్ల రూపాయల ఖర్చు చేశారు. ఆఖరికి ప్రధాన మంత్రి కూడా ఇంత పెద్దనివాసం ఉండరని చెప్పుకొచ్చారు.

# విశాఖ, తిరుపతిలో సినీ పరిశ్రమను అభివృద్ధి

**పరిశ్రమ అభివృద్ధికి త్వరలో కొత్త పాలసీ**
**సినీ ప్రముఖులతో చర్చించి కార్యాచరణ రూపొందిస్తాం**
**సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడి**

అమరావతి,మార్చి 20(ఆర్ఎన్ఎ): విశాఖపట్నం, తిరుపతిలో సినీ పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. సినీ పరిశ్రమ అభివృద్ధికి త్వరలో కొత్త పాలసీ తీసుకురాబోతున్నట్టు చెప్పారు. సినీ ప్రముఖులతో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. విశాఖపట్నంలో సినీపరిశ్రమ అభివృద్ధి, గిరిజన ప్రాంతాల్లో పర్యాటకాభివృద్ధిపై మండలిలో ప్రశ్నోత్తరాల సందర్భంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. విశాఖలో చలన చిత్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్న మంత్రి... కూటమి ప్రభుత్వం రాగానే సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సినీ పరిశ్రమకు చెందిన పెద్దలతో చర్చించారని, హైదరాబాద్ తరహాలో స్టూడియోలను రాష్ట్రంలో ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరినట్లు- తెలిపారు. ఏపీ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో అద్భుతమైన లొకేషన్లు ఉన్నాయని, స్టూడియోలు నిర్మిస్తే ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని నిర్మాతలను చెప్పినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వం ద్వారా లేక పీపీపీ మోడ్‌లో స్టూడియోల నిర్మాణానికి సహకారం అందిస్తామన్నారు. విశాఖలో రామానాయుడు స్టూడియోకు గతంలో 34 ఎకరాలు కేటాయించగా.. గత ప్రభుత్వం ఇందులో 15 ఎకరాలు లేఅవుట్లు- వేసి ఇతర అవసరాలకు మళ్లించిందన్నారు. రాబోయే రోజుల్లో 34 ఎకరాలను సినీ పరిశ్రమకు వినియోగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజన ప్రాంతాలకు సంబంధించి 1/70 చట్టాన్ని సవరించే ఉద్దేశం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని, గిరిజనుల భాగస్వామ్యంతో పర్యాటకం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

శ్రీచక్ర
SREECHAKRA TELUGU DAILY
శుక్రవారం 21-03-2025

# సంపాదకీయం

## రాజకీయ సంస్కరణలు రావాలి !

రాజకీయ సంస్కరణలు లేకుండా భారత్మనుగడ సాధ్యం అయ్యేలా కనిపించడం లేదు. ఎంతసేపు సీట్లు, ఓట్లు,నాయకుల జీతాలు, భత్యాలు, పెన్షన్లు, ఉచిత పథకాలు వంటివాటి చుట్టే రాజకీయం సాగుతోంది. దీనికి ఎక్కడో ఒక చోట ముగింపు రావాల్సి ఉంది. చైనా లాంటి దేశాలు ఆర్థికంగా పురోగమిస్తుంటే భారత్ మాత్రం కేవలం రాజకీయ నాయకుల స్వార్థం కారణంగా కుంటుతోంది. ఇంకా సీట్లు పెంచుకోవాలి...తమకు అవకాశాలు పెంచుకోవాలన్న దురాలోచన తప్ప ప్రజల సమస్యలు తీర్చడం, ఆకలి బాధలు తీర్చడం, సౌకర్యాలు పెంచడం వంటివన్నీ పక్కకు పోతున్నాయి. ప్రజల ఎజెండా ముందుకు రావడం లేదు. డీలిమిటేషన్‌తో తమ సీట్లు తగ్గుతాయని గొడవ చేస్తున్న స్టాలిన్ లాంటి వారు దీనికి సమాధానం చెప్పాలి. ఆయనకు వ్తాసు పలుకుతున్న వారు కూడా సమాధానం చెప్పాలి. అలాగే పదేళ్ళుగా అధికారంలో ఉన్ మోడీ ముందుగా సమాధానం చెప్పాలి. ప్రజల కొనుగోలు శక్తి పెరిగిందా లేదా..ధరలు అదుపులోకి వచ్చాయా లేదా..నిరుద్యోగం తగ్గిందా లేదా అన్నది చట్టసభల్లో చర్చించడం లేదు. ప్రజలకు అవసరం లేని ఎజెండాలు తెరపైకి తెచ్చి, తమ పబ్బం గడుపుకునే రాజకీయాలు సాగుతున్నాయి. భారత జనాభా 140 కోట్లకు చేరిన క్రమంలో ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరడం లేదు. ఇంకా జనాభా పెరగాలని కొందరు ప్రాంతీయ పార్టీల నేతలు ముఖ్యంగా స్టాలిన్, చంద్రబాబు లాంటి వారు ప్రచారం చేయడం సిగ్గుచేటు. ఉన్న ప్రజలకు సరైన ప్రాథిమిక సౌకర్యాలు కలిగించకుండా తమ రక్షణ కోసం వందలకోట్లు వెచ్చిస్తున్న వీరు ప్రజలను రక్షిస్తారనుకోవడం అత్యాశే కాగలదు. మారుతున్న కాలానుగుణంగా పాలకుల్లో మార్పులు రావడం లేదు. ఇకపోతే ఒకే పార్టీలో ఉంటున్న కొందరు రాజకీయ గుత్తాధిపత్యం చెలాయిస్తున్నారు. పాలనలో వారు, వారి కుటుంబ సభ్యులే నిరంతరంగా ఉండే విధంగా రాజకీయాలను తమకు అనుకూలంగా మార్చేసుకుంటున్నారు. పార్లమెంట్, అసెంబ్లీలకు ఒక్కరినే నిరంతరంగా ఎన్నుకునే విధానం కూడా మంచిది కాదు. ఈ క్రమంలో రాజకీయాల్లో మార్పులు రావాలి. అమెరికా తరహాలో కేవలం రెండు పర్యాయాలు మాత్రమే ఎన్నికల్లో పోటీచేసే విధానం రావాలి. ఒక్కరే ఏళ్లతరబడి ఎంపిలుగా, ఎమ్మెల్యేలుగా ఉండకుండా కేవలం రెండు టర్ముల కాలాన్ని మాత్రమే నియంత్రించాలి. ఈ మేరకు రాజ్యాంగంలో సవరణలు తీసుకుని రావాల్సి ఉంది. ప్రజలు ఈ ఎజెండాతో ముందుకు రావాలి. అప్పుడే యువతకు అవకాశం వస్తుంది. ముువత రాజీకాయల్లోకి వస్తే మార్పులు కూడా వస్తాయి. ఎన్నికల్లో పోటీ చేసేవారికి అర్హతలను కూడా నిర్ణయించాలి. ఇలా అర్హతలు లేకపోవడం వల్లనే స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్య ఫలాలు అందరికీ అందడం లేదు. కొందరే పాలకులుగా ఉంటూ..ప్రజల ఆకాంక్షలను విస్మరిస్తున్నారు. అందుకే పేదలు పేదలుగానే ఉన్నారు. ఆకలి కోసం అలమటిస్తున్న వారు అలాగే ఉన్నారు. రాజకీయ నేతలు పేదల పేరు చెప్పి పబ్బం గడుపుకుంటున్నారు. పాలకుల నిర్లక్ష్యం,విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేయడం,ఉచిత పథకాలను ప్రవేశ పెట్టడం వంటివన్నీ తగ్గాలి. మనం వేసే ఓటు సక్రమంగా పనిచేస్తుందా లేదా అన్నది ప్రజలు ఆలోచన చేయాలి. మన ఓటుతో గెలిచిన నేతలు సక్రమంగా పనిచేస్తున్నారా లేదా అన్నది కూడా ప్రజలే ఎప్పటికప్పుడు పరిశీలన చేయాలి. మన ఓటును ఆయుధంగా చేసుకుని దేశాన్ని సక్రంగా ముందుకు తీసుకుని వెళుతున్నారా లేదా అన్న ఆలోచన చేయాలి. ఏదో ఓటేశామన్న నిర్లిప్త ధోరణి కారణంగా పాలకులు రాజకీయాలను వ్యాపారంగా మార్చుకుని, అధికారం చేతబట్టి శాసిస్తున్నారు. ప్రజలను ఓటుబ్యాంకుగా తయారుచేసుకుని వారిని మభ్యపెట్టడం అలవర్చుకున్నారు. ఎన్నికల అక్రమాల్లో ఆరితేరిన నేతలంతా పాలకులుగా పెత్తనం చెలాయిస్తున్నారు. ఓట్లను కొనుగోలు చేయడం ఎలాగో నేర్చుకున్నారు. మనం ఓటుకు అమ్ముడు పోవడం వల్లనే ఇలా జరుగుతోందని గుర్తించాలి. తమకు అనుకూలమైన ఎన్నికల అధికారులను, పోలీస్ అధికారులను అడ్డం పెట్టుకుని ఓట్లను వేయించుకుని ఎన్నికవుతున్నారు. ఈ విధానం పోవాలంటే ఎన్నికల్లో భారీ సంస్కరణలు రావాలి. ఒక్కరే నిరంతరంగా సర్పంచ్ నుంచి ఎంపి వరకు ఎల్లవేళలా ఎన్నికయ్యే పద్ధతికి స్వస్తి పలకాలి. చట్టసభల్లో అమెరికా లాగా కేవలం రెండు పర్యాయాలు మాత్రమే పోటీచేసే అవకాశం మాత్రమే ఉండాలి. ఎంపి, లేదా ఎమ్మెల్యేగా గెలిచిన వారు రెండు టర్మ్‌లకు మించి పనిచేయకుండా చట్టబద్ద విధానం అమల్లోకి తీసుకుని రావాలి. జీవితాంతం ఒక్కరే ఎంపిగా లేదా ఎమ్మెల్యేగా ఉండే విధానం పోవాలి. దీనికి తక్షణ రాజ్యాంగ సంస్కరణ అవసరం. అప్పుడు ప్రజల్లో ఎక్కువ మందికి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం వస్తుంది. కొందరు నాయకులు మాత్రమే నిరంతరంగా అధికారాన్ని అడ్డం పెట్టుకునే ఆగత్యం ఉండదు. అలాగే కుటుంబంలో ఒక్కరికి ఒకే పదవి అన్న విధానం కూడా రావాలి. వారసత్వ రాజకీయాలను అడ్డుకోవడానికి ఇది దోహద పడగలదు. దేశంలోని యువత, మేధావులు దీనిపై చర్చచేయాలి. అలాగే రాజకీయ నాయకుల అవినీతిపై తక్షణం విచారణ జరిగేలా చట్టాలు రావాలి. సామాన్యులకు ఎలా అయితే చట్టబద్ద విచారణ సాగి, శిక్షలు పడుతున్నాయో రాజకీయాల ను, పాలనను అడ్డం పెట్టుకుని అడ్డగోలుగా కోట్లు గడిస్తున్న నాయకులకు కూడా అలాగే విచారణ జరగాలి. శిక్షలు పడాలి. ి పాల్పడిన నేతలను విచారించి కఠినచర్యలు తీసుకునే అధికారం కేంద్రప్రభుత్వానికి ఉండాలి. కేంద్రంలో అవినీతి జరిగితే కూడా నేతలను తక్షణం విచారించే రాజ్యాంగ వ్యవస్థ రావాలి. రాజకీయ నేతల అవినీతిపై తక్షణం లోక్‌పాల్ ఏర్పాటు అత్యావశ్యకం. ఎప్పటికప్పుడు సంస్కరణలు చేసుకుంటూ.. రాజ్యాంగాన్ని సవరించుకుంటున్న మనం ఈ విషయంలో కూడా సవరణలకు పూనుకోవాలి

# సాంకేతిక పరిజ్ఞానంతోనే నేరాల నియంత్రణ

**ఆధునిక సాంకేతికతతో నేరస్థులపై నిఘా ఉంచాలి**
**సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్**





కర్నూలు, మార్చి 20 (శ్రీచక్ర): పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, నేరాల నియంత్రణతో పాటు నేరస్థులను పట్టుకోవాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ సంధర్భంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలతో కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ నేర సమిక్షా సమావేశం నిర్వహించారు. ఈ నేర సమిక్షా సమావేశంలో వర్చువల్ విధానంలో పాల్గొన్న సిఐడి ఐజి వీనిత్ బ్రిజ్ లాల్ తో జిల్లా ఎస్పీ మాట్లాడారు. సిఐడి ఐజి గారు సిసిటిఎన్ఎస్ గురించి జిల్లా ఎస్పీతో మాట్లాడారు. ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ పోలీసు అధికారులతో మాట్లాడారు. కర్నూలు , పత్తికొండ , ఆదోని , ఎమ్మిగనూరు సబ్ డివిజన్ లో దీర్ఘకాలంగా ఉన్న పెండింగ్ కేసుల గురించి జిల్లా ఎస్పీ సమిక్షించి ఆరా తీశారు. పోలీసుస్టేషన్ల వారీగా కేసుల పెండింగ్ కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పలు సలహాలు, సూచనలు చేశారు. కేసు నమోదు నుంచి అభియోగ పత్రాలు దాఖలు వరకు ప్రతి అంశాన్నీ సీసీటీఎన్ఎస్ అప్లికేషన్‌లో నమోదు చేయాలన్నారు. పోలీసు స్టేషన్లలో నమోదయ్యే కేసుల వివరాలను ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా సిసిటిఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు పొందుపర్చాలన్నారు. అన్ని వివరాలు నమోదు చేయడం వల్ల కేసులు, వ్యక్తుల పూర్తి సమాచారం తెలుస్తుందని అది అందరికీ ఉపయోగపడేలా దోహదం చేస్తుందన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ సిడి ఫైళ్ళను ఆయా పోలీసు అధికారులు సిసిటిఎన్ఎస్ లో నమోదు చేసారో లేదో అని ఆరా తీశారు. సీసీటీఎన్ఎస్‌లో ముఖ్యంగా గ్రేవ్ కేసులు, నాన్ గ్రేవ్ కేసులలో పార్ట్ 1, పార్ట్ 2 సీడీలు అప్డేట్‌గా ఉండేలా చూసుకోవాలన్నారు. మర్డర్ కేసుల్లో, 174 సిఆర్‌పిసి కేసుల్లో త్వరితగతిన పురోగతి పొందేలా చూసుకుంటూ అభియోగ పత్రాలను వీలైనంత తొందరగా కోర్టులో ధాఖలు చేయాలన్నారు. డిఎస్పీ స్థాయి అధికారులు దర్యాప్తు చేస్తున్నపుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్రైమ్ రికార్డు సిడి ఫైల్స్ తయారు చేయడంలో , సిసి టిఎన్ ఎస్ లో వివరాలు నమోదు అప్ డేట్ చేయడంలో ఎలాంటి లోపాలు ఉన్నాయో తెలియజేశారు. ఎమి చేయాలి, ఎమి చేయకూడదనే విషయాలను తెలియజేశారు. పోలీసుస్టేషన్ లలో పని చేసే సిసిటిఎన్ ఎస్ పోలీసు సిబ్బందితో మాట్లాడారు. గ్రేవ్ కేసులు, యు ఐ కేసులు, మర్డర్ , సైబర్ నేరాల కేసులు, పోక్సో కేసులు , మిస్సింగ్ కేసులు, ఎస్సీ ఎస్టీ కేసులు, డ్రంకెన్ డ్రైవ్, ఒపెన్ డ్రింకింగ్ కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ ఆయా పోలీసుస్టేషన్ల పరిధులలో తనిఖీలు నిర్వహించాలన్నారు. సైబర్ నేరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ నేర సమిక్షా సమావేశంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి. హుస్సేన్ పీరా,ఏర్ అడిషనల్ ఎస్పీ కృష్ణ మోహన్, డిఎస్పీలు బాబు ప్రసాద్,శ్రీనివాసాచారి,ఉపేంద్రబాబు , హేమ లత,భాస్కర్ రావు, ట్రైనీడీఎస్పీఉషశ్రీ,సిఐలు,ఎస్సైలు పాల్గొన్నారు.

# పథకాల పేర్లు మార్పులు

## రాజకీయ రచ్చ చేస్తున్న నేతలు

విశాఖపట్టణం,మార్చి20( ఆంధ్రప్రదేశ్‌లో పేర్లమార్పు వివాదం మరోసారి రాజకీయరచ్చ రేపుతోంది. మొన్న హెల్త్ యూనివర్సిటీ– ..నిన్న కడప జిల్లా..తాజాగా విశాఖ క్రికెట్ స్టేడియం..ఇలా పేర్లను తొలగించడంపై వైరాపా ఆందోళనలకు దిగుతోంది. ఇందులో విశాఖ స్టేడియం ఇప్పుడు పేరు మార్చుకుంది. గతంలో హెల్త్ వర్సిటీకి ఎన్నో ఏళ్లుగా ఎన్టీఆర్ పేరు ఉండేది. జగన్ దానిని కెటికి వైఎస్ పేరు తగిలించారు. కడప జిల్లాను కేవలం వైఎస్సార్ జిల్లాగా చేశారు. ఇక్కడ ప్రజల సెంటిమెంట్‌ను దెబ్బతీసారు. జగన్ అధికారంలోకి రాగానే కూల్చవేతలతో మొదలు పెట్టారు. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భవనాన్ని కూల్చారు. ఇలా ప్రభుత్వాలు ప్రజల సొమ్ముతో ఆడుకుంటున్నాయి. ఇష్టారాజ్యంగా పేర్లు మారుస్తున్నారు. దీనికి స్వస్తి పలకాల్సి ఉంది. అందుకే ఇప్పుడు టిడిపి కూటమి ప్రభుత్వం వైఎస్సార్ కడప జిల్లాగా మార్చింది., ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ పేరును యధాతథంగా మార్చేసింది. ప్రభుత్వం. అటు– పథకాలకు..ఇటు– కట్టడాలకు దివంగత సీఎం వైఎస్ పేరు తొలగించడంపై వైసీపీ మండిపడుతోంది... ప్రభుత్వ తీరును నిరసిస్తూ విశాఖలో ఆందోళనకు పిలుపునిచ్చింది.. దీంతో అక్కడ వైఎస్ విగ్రహానికి పాలాభిషేకం చేసిన కార్యకర్తలు వైఎస్ పేరును కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఇటీవలే వైయస్ఆర్ జిల్లా పేరును వైయస్ఆర్ కడప జిల్లాగా..వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ– పేరును తాడిగడప మున్సిపాలిటీగా మార్పు చేస్తూ ఏపీ కేబినెట్ నిర్ణయం తీసుకుంది... ఇప్పుడు తాజాగా విశాఖలోని డాక్టర్ వైఎస్ఆర్ ఏసీబీ వీడీసీఎం స్టేడియం పేరులో..వైఎస్ఆర్ పేరు మాయమయింది. దీంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నాగార్జున యూనివర్సిటీలో వైఎస్ విగ్రహాన్ని తొలగించారని.. బాపట్లలో వైఎస్సార్ విగ్రహాన్ని తగలబెట్టారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు.. విశాఖలోని స్టేడియంకు వైఎస్ఆర్ పేరును తొలగించడాన్నినిరసిస్తూ నేడు స్టేడియం దగ్గర ఆందోళనకు దిగారు. ఏపీలో అధికారం మారినప్పుడల్లా పేర్ల మార్పుపై రాజకీయ రచ్చ కొనసాగుతోంది. గతంలో విజయవాడ లోని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ– పేరును వైసీపీ ప్రభుత్వం వైయస్సార్ హెల్త్ వర్సిటీగా మార్చింది. ఇది కావాలని చేసి లేని రచ్చను చేసింది. అధికారంలోకి రాగానే తిరిగి ఎన్టీఆర్ పేరును హెల్త్‌వర్సిటీకి పెట్టింది కూటమి ప్రభుత్వం. విశాఖ సీతకొండ హిల్‌వ్యూ పాయింట్‌ను గత వైసీపీ ప్రభుత్వం.. వైయస్ పేరు పెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీనికి అబ్దుల్ కలామ్ వ్యూ పాయింట్‌గా పేరు మార్చింది. 2019లో అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ హయాంలో అమలైన పలు పథకాల పేర్లను మార్చేసింది జగన్ ప్రభుత్వం.. జగనన్న, వైఎస్ఆర్ పేర్లతో పథకాలను అమలు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జగన్, వైఎస్ఆర్ పేర్లతో ఉన్న పథకాలకు కొత్త పేర్లు పెట్టింది. జగనన్న అమ్మఒడి పేరును తల్లికి వందనంగా మార్చగా.. జగనన్న విద్యా కానుక పథకాన్ని 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర' అని పేరు పెట్టారు. అలాగే, జగనన్న గోరుముద్దను 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం'గా మార్పు చేశారు. జగనన్న ఆణిముత్యాలును 'అబ్దుల్ కలాం ప్రతిభా పురస్కారం'గా మార్చింది ప్రభుత్వం. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనల పథకాల పేర్లను 'పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్'గా మార్చారు. జగనన్న విద్యాదీవెన పథకం 'అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి'గా మార్చింది కొత్త ప్రభుత్వం. అలాగే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పేరు కాస్తా.. ఎన్టీఆర్ ఆరోగ్య భరోసాగా మారింది. రాష్ట్రంలో వైఎస్ పేరు కనిపిస్తే కూటమి పార్టీలకు భయం పుడుతోందని..అందుకే ఇలాంటి చర్యలకు దిగుతున్నారని వైసీపీ మండిపడుతోంది.

# త్వరలోనే తెలుగుదేశంలో చేరుతా

**వైకాపా మోసాలను తట్టుకోలేకే రాజీనామా**
**ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ వెల్లడి**


గుంటూరు,మార్చి 20( ఎలాంటి షరతులు లేకుండానే తెలుగుదేశం పార్టీ లో చేరతానని ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన మర్రి రాజశేఖర్ తెలిపారు. గుంటూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైకాపా అధినేత జగన్ వైఖరి, మోసం వల్లే ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నా. కాంగ్రెస్ పార్టీలో ఉన్న నేను.. 2011లో వైకాపాలో చేరా. దాదాపు 14 ఏళ్లు ఉమ్మడి గుంటూరు జిల్లాలో వైకాపా బలోపేతానికి కృషి చేశా. 2019 ఎన్నికల్లో విజయం ఖాయం అనుకుంటున్న వేళ మరో వ్యక్తిని తీసుకొచ్చి నిలబెట్టారు. పార్టీ అధికారంలోకి వస్తే నన్ను ఎమ్మెల్సీ చేసి మంత్రి పదవి ఇస్తానని జగన్ బహిరంగంగా హామీ ఇచ్చారు. జగన్ మాట విని కార్యకర్తలు, అభిమానులు పార్టీ విజయం కోసం పనిచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ మాట తప్పి వేరే వారికి మంత్రి పదవి ఇచ్చారు. ప్రతి ఎమ్మెల్సీ ఎన్నికల వేళ మర్రి రాజశేఖర్‌కు పదవి అంటూ మోసం చేశారు. పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసిన నాకు కనీస గౌరవం ఇవ్వలేదు. చిలకలూరిపేట నుంచి గెలిచిన వ్యక్తి 2024లో గుంటూరుకు వెళ్లారు. అప్పుడు కూడా నియోజకవర్గంలో నన్ను సంప్రదించకుండా.. నన్ను కాదని వేరే వారిని నిలబెట్టారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత తిరిగి నియోజకవర్గ బాధ్యతలు అప్పగించారు. గుంటూరులో 53వేల ఓట్ల తేడాతో ఓడిపోయిన వారికి తిరిగి నియోజకవర్గ బాధ్యతలు అప్పగించారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి పనిచేసిన నన్ను, కార్యకర్తలను కనీసం సంప్రదించలేదు. అందుకే వైకాపాకు రాజీనామా చేస్తున్నా. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన తర్వాతే పార్టీ మారుతున్నా. ఆత్మగౌరవం కోసమే వైకాపాను వీడుతున్నా. త్వరలో తెలుగుదేశం పార్టీలో చేరతా' అని మర్రి రాజశేఖర్ తెలిపారు.

# పక్కా ఓటర్ కార్డుకు అడుగు పడాలి

**ఆధార్ మాదిరి ప్రత్యేక ఓటర్ కార్డు రావాలి**
**ఎన్నికల సంస్కరణలపై ఇసి దృష్టి పెట్టాలి**

న్యూఢిల్లీ,మార్చి20( : ఏటా ఓటరు దినోత్సవం జరుపుకుంటున్నా.. ఓటు విషయంలో పక్కా ప్రణాళికలు అమలు కావడం లేదు. ఆధార్, పాన్‌కార్డు పక్కాగా ఉంటున్నా...ఓటరు కార్డును నేటికీ పక్కాగా రూపొందించుకోవడం లేదు. తాజాగా వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఆధార్‌తో ఓటును అనుసంధానం చేస్తామని ఎన్నికల సంఘం ప్రకటించింది. నిజానికి ఈ పని ఎప్పుడో చేయాలి. ఓటు అన్నది ప్రజాస్వామ్య ప్రక్రియలో ఎంతో విలువైనది. దీనిపై నిర్లక్ష్యం తగదు. ఓటర్ల నమోదు నుంచి దొంగ ఓట్ల వరకు ..ఎక్కడ లోపం ఉందో ఎన్నికల సంఘం ఆలోచించడం లేదు. ఎన్ని ప్రకటనలు గుప్పించినా నేటికీ పక్కాగా ఓటు నమోదు కార్యక్రమాలు జరగడం లేదు. ఓటును ఆధార్‌కు అనుసంధానం చేయాలన్న సంకల్పం నెరవేరడం లేదు. అలాగే పర్మినెంట్ ఓటర్ ఐడి కార్డు నంబర్ ఉంటే తప్ప దొంగ ఓట్లకు స్వస్తి చెప్పలేము. ఓట్లను తొలగించారన్న ఆందోళనలూ తప్పుతాయి. ఈ రెండు అంశాలను ప్రజలు, మేధావులు విస్తృతంగా చర్చించాలి. ఇకపోతే తమ ఓటు పదిలం అన్న భరోసా ప్రజల్లో రావడం లేదు. ఎన్నికల సంఘం ఈ మేరకు అనేక కార్యక్రమాలతో ప్రజల్లో ఓటు చైతన్యానికి కృషి చేయాలి. అయితే సంస్థాగతంగా ఉన్న లోటుపాట్లపై మాత్రం కేంద్ర ఎన్నికల సంఘం దృష్టి సారించడం లేదు. ఓటర్ల నమోదు మొదలుకుని దొంగ ఓట్ల వరకు అనేక అనర్థాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఓటు వేసేందుకు వెళ్లే వరకు ఓటు ఉంటుందో లేదో తెలియడం లేదు. ఆధార్ నమోదు చేసుకున్నట్లుగానే పర్మినెంట్ నంబర్ ఉండాలి. పాన్ కార్డు నమోదయితే పర్మినెంట్ నంబర్ ఉంటుంది. ఓటుకు పర్మినెంట్ నంబర్ రావాల్సి ఉన్నా ఎందుకనో ప్రభుత్వం లేదా కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవడం లేదు. ఓటుకు ఆధార్ అనుసంధానం చేయడం ద్వారా ఓటును కూడా పర్మినెంట్ చేయాలి. ఇదే సందర్భంలో ఓటుకు కూడా ఆధార్ లాగా పర్మినెంట్ నంబర్ కూడా కేటాయిస్తే మరీ మంచిది. అప్పుడు బోగస్ అన్నదానికి చెక్ పెట్టగలం. ఎన్నికల సంస్కరణలను ఆషామాషీగా కాకుండా పక్కాగా అమలు చేస్తేనే మంచిది. ఓటుకు కూడా ఆధార్ లాగా పర్మినెంట్ నంబర్ ఉంటే ఇలాంటి తొలగింపు అవకాశాలు ఉండవు. ఎలాంటి లోటుపాట్లు లేని ఓటరు నమోదుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఎన్నికల సంఘం గుర్తించడం లేదు. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన రాజ్యాంగ వ్యవస్థగా ఉన్న ఎన్నికల సంఘం ఈ మధ్య అనేక వివాదాల్లో చిక్కుకుంటోంది. విపరీతమైన అధికారాలు కలిగి ఉన్నా సమర్థత ప్రదర్శించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికలు ప్రాణప్రదమైనవి. ఓటర్ల జాబితాలు ఎంత స్వచ్ఛంగా, దోషరహితంగా ఉంటే ఎన్నికలు అంత సవ్యంగా జరుగుతాయి. కానీ ఇప్పుడదే వివాదంగా మారింది. ఓటర్ల నమోదు, తొలగింపు ఓ ప్రహసనంగా మారంది. పక్కా కార్యాచరణ జరగడం లేదు. శేషన్ లాగా బూజు దులిపి హంటర్ చేతబట్టిన వారు తరవాతి కాలంలొ రాలేదు. ఓటర్ల నమోదు, తొలగింపు, నిర్వహణ అంతా వివాదాల్లో నడుస్తోంది. ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్ప క్షపాతంగా నిర్వహించడం ఈ సంస్థ నైతిక బాధ్యత. ఓటర్ల జాబితాలలో అనేక అవక తవకులు బయటపడుతున్నా పట్టించుకోవడం లేదు. ఎన్నికల కమిషన్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి పైనా, రాష్ట్రప్రభుత్వ సిబ్బంది పైనా ఆధారపడి చర్యలు తీసుకోవలసి ఉంటుంది. రాష్ట్ర అధికారులు సహజంగానే అధికారపార్టీకి విధేయంగా ఉంటారు. అటువంటప్పుడు అధికారపార్టీ బుద్ధిపూర్వకంగా రకరకాల ఎన్నికల అక్రమాలకు ఒడిగట్టితే వాటిని ఎన్నికల కమిషన్ ఏవిధంగా నివారించగలదనే సందేహం కలుగుతోంది. ఏటా జాతీయ ఓటరు దినోత్సవం జరుపుకుంటున్న వేళ ఓటర్ల సవరణపై కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ఇప్పటి వరకు వచ్చిన ఆరోపణలను గమనించి సంస్కరణలకు శ్రీకారం చుట్టాలి. ఓటర్ల తొలగింపు ఇప్పుడు పెద్ద సమస్యగా పరిణమించింది. దీనిని ఏ విధంగా చక్కదిద్దుతారో తెలియడం లేదు. ఓటరు ఐడి కార్డు పట్టుకుని వెళితే జాబితాలో పేర్లు ఉండడం లేదు. దీనికి పక్కా విధానం అమలు కావాల్సి ఉంది. దొంగ ఓట్ల విషయంలో కూడా ఇసి సరైన చర్యలు తీసుకోవడం లేదు. ఓట్ల నమోదులో కొన్ని రాజకీయ పక్షాలు అదే పనిమీద ఉంటాయి. అధికార పార్టీ నేతలు బోగస్ ఓట్లను చేర్పించేందుకు ప్రత్యేక కార్యక్ర మాన్ని ముమ్మరంగా కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు అన్నచోట్లా వున్నాయి. సర్వేల పేరిట జరుగుతున్న తతంగం కూడా అధికార పార్టీ నేతల పర్యవేక్షణలోనే సాగుతోందని ప్రతిపక్షాలు అంటున్నాయి. రెవెన్యూ అధికారులు ఎటువంటి విచారణ లేకుండానే బోగస్ ఓటర్లను నమోదు చేసుకుంటున్నారంటూ ఆరోపణలు వస్తున్నాయి. దొంగ ఓట్లు ఫలానా ప్రాంతంలో ఉన్నాయనీ, దర్యాప్తు జరిపించి నిజం నిగ్గు తేల్చాలనీ ఎన్నికల ప్రధానాధికారి జిల్లా ఎన్నికల అధికారిని ఆదేశిస్తే చక్కదిద్దు తారన్న భరోసా లేదు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలి. అప్పుడే ఇసి సక్రమంగా ముందుకు వెళ్లగలదు. అధికారుల పరిశీలనలో దొంగ ఓట్లు నమోదైనట్టు రుజువైతే తప్ప చర్యలకు ఉపక్రమించడం లేదు.

## విద్యార్థినీలు అపరిచితుల పట్ల జాగ్రత్తగా ఉండాలి కర్నూల్ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి సరోజమ్మ






కర్నూల్ లీగల్, మార్చి 20 (శ్రీ చక్ర): విద్యార్థినీలు అపరిచితుల పట్ల జాగ్రత్తగా ఉండాలి కర్నూల్ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి సరోజమ్మ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం పసుపులలోని గవర్నమెంట్ హైస్కూల్ లో పోక్సో యాక్ట్ పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అధితిగా కర్నూలు ఎక్సయిజ్ మేజిస్ట్రేట్ సరోజమ్మ హాజరై మాట్లాడుతు విద్యార్థినీలకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. రక్షణ చట్టం- 2012 ప్రకారం చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని తెలిపారు. 18 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడకుండా ఈ పోక్సో యాక్ట్ ఉపయోగ పడుతుందని అన్నారు. పోక్సో కేసులను త్వరిత గతిన పరిష్కరించేనీదుకు ప్రత్యేక కోర్ట్ ఉందన్నారు. ఈ సదస్సులో తాలూక ఎస్.ఐ. చంద్రశేఖర్ రెడ్డి, హెడ్ మాస్టర్ విజయమ్మ, టీచర్స్ పాల్గొన్నారు.

## శివారు కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు



కర్నూలు, మార్చి 20 (శ్రీచక్ర): నగరంలోని శివారు ప్రాంతాల కాలనీల్లో మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు తెలిపారు. గురువారం ఆయన పెద్దపాడు రోడ్డులోని బోసిరెడ్డి కాలనీ, పోలీస్ కాలనీ ప్రాంతాల్లో పర్యటించారు. ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ రెండోవ పటాలం అసిస్టెంట్ కమాండెంట్ మహబూబ్ బాషాతో కలిసి కాలనీల్లో నెలకొన్న సమస్యలపై చర్చించారు. రహదారులు, మురుగు కాలువలు, తాగునీటి సమస్య పరిష్కరించాలని పోలీస్ అధికారులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని, అత్యవసర పనులకు ప్రాధాన్యత ఇస్తూ ఒక్కొక్కటిగా సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. కాగా అంతకన్నా ముందు ఆయన ఎస్‌బిఐ ఎంప్లాయిస్ కాలనీ, అశోక్ నగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.

## బకాయి సముదాయాల ఎదుట చెత్తా వాహనంతో నిరసన

### ట్రేడ్ లైసెన్స్ మొండి బకాయిదారులపై ఒత్తిడి పెంచేందుకు చర్య




కర్నూలు, మార్చి 20 (శ్రీచక్ర): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో, మొండి బకాయిలపై నగరపాలక సంస్థ ప్రత్యేక దృష్టి సారించింది. కొంతకాలంగా వినూత్న కార్యక్రమాలతో పన్ను బకాయిదారులపై ఒత్తిడి తీసుకొస్తున్న అధికారులు, తాజాగా మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్థానిక దేవనగర్‌లోని ఎంయస్9 లార్జ్ యాజమాన్యం, గత ఏడేళ్లుగా రూ. 3,31,250 లు నగరపాలకకు ట్రేడ్ లైసెన్స్ రుసుములను చెల్లించడంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో, గురువారం సంబంధిత లార్జ్ ఎదుట అధికారులు చెత్త వాహనం నిలిపి నిరసన వ్యక్తం చేశారు. నగరపాలక నుండి ప్రయోజనాలు పొందుతూ, పన్నులు చెల్లించకుండా ఉండటం తగదని అధికారులు సూచించారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, తనిఖీదారుడు అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 22వ తేదిన డిప్యూటీ సీఎం జిల్లా పర్యటనను విజయవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా

కర్నూలు, మార్చి 20 (శ్రీచక్ర): ఈ నెల 22వ తేదీన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జిల్లాకు రానున్నారని, ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పకడ్బందీగా చేసి జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. డిప్యూటీ సీఎం ఓర్వకల్లు మండలం పూడి చెర్ల గ్రామ పరిధిలో ఉన్న రైతు పొలంలో ఫార్మ్ పాండ్ కు భూమి పూజ చేసి, తదుపరి బహిరంగ సభలో పాల్గొననున్న సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తో కలిసి జిల్లా కలెక్టర్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లు, భద్రత గురించి ఎస్పీ తో చర్చించారు. సుమారు 4 వేల మంది వరకు బహిరంగ సభకు హాజరవుతారని, అందుకనుగుణంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. స్టేజ్ అరేంజ్మెంట్స్, బ్యారికేడింగ్ తదితర ఏర్పాట్లకు సంబంధించి ఆర్ అండ్ బి ఎస్ ఈ కి పలు సూచనలు ఇచ్చారు. వేదికపై చేయవలసిన ఏర్పాట్లను చూసుకోవాలని జడ్పీ సీఈవో ను ఆదేశించారు. పారిశుధ్య చర్యలు,శిలా ఫలకం ఏర్పాటు, బ్యాక్ డ్రాప్, తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా, సౌండ్ సిస్టమ్, ఎల్ ఈ డి లు, తదితర ఏర్పాట్లపై తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు చేయాలని, శుక్రవారం





సాయంత్రం ఏర్పాట్లు పూర్తి కావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ ఓర్వకల్లు ఎయిర్ పోర్ట్ ను సందర్శించి తీసుకోవలసిన చర్యలపై అధికారులకు పలు సూచనలు ఇచ్చారు ..ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జడ్పి సి ఇ ఓ నాసర రెడ్డి ,ఎస్ ఇ పిఆర్ రామచంద్రారెడ్డి,ఎస్ ఇ ఆర్ ఉ బి మహేశ్వర్ రెడ్డి,ఎస్ ఇ ఆర్ డబ్లు ఎస్ నాగేశ్వరరావు, ఎస్ ఇ ట్రాన్స్ కో ఉమాపతి, డిస్టిక్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ శాంత కుమారి , ఆర్ టి సి ఆర్ఎం శ్రీనివాసులు , కర్నూలు ఆర్ డి ఓ సందీప్ కుమార్, డ్వామా పిడి వెంకట రమణయ్య, మెప్మా పి డి నాగ శివ లీల, డి ఐ పి ఆర్ ఓ జయమ్మ , కర్నూలు డి ఎస్ పి బాబు, ప్రసాద్, డి ఎమ్ సివిల్ సప్లైస్ నాగ సుధ ,డి ఎస్ ఓ రాజా రఘువీర్, డిప్యూటీ డి ఏం హెచ్ ఓ భాస్కర్,డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ అవినాష్ జయసింహ, డి పి ఓ భాస్కర్, ఎక్జిక్యూటివ్ ఇంజనీర్లు మద్దన్న , సురేష్ , ఓర్వకల్లు తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపిడిఓ తదితరులు పాల్గొన్నారు.

# ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో జర్నలిజం లేకపోతే ప్రజాస్వామ్యం మనుగడ ప్రశ్నార్థకం

జర్నలిస్టులు విధి నిర్వహణతో పాటు వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణను పాటించాలి×జర్నలిస్టులో ఉచిత వైద్య శిబిరంలో సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ కర్నూలు, మార్చి 20 (శ్రీచక్ర): ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ప్రజాస్వామ్యం కొనసాగుతుందంటే అది కేవలం జర్నలిజం కారణంగానేనని, జర్నలిజం అంటూ లేకపోతే ప్రజాస్వామ్యం మనగడ ప్రశ్నార్థకంగా మారుతుందని సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. గురువారం కర్నూల్ నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఉన్న రెవెన్యూ భవన్లో మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన వీడియో జర్నలిస్ట్ చిన్న స్మారకార్థం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బి పి, ఈ సి జి ,టు డి ఎకో లాంటి విలువైన పరీక్షలు ఉచితంగా ఏర్పాటు చేయడం అభినందనీయమని చెప్పారు. జర్నలిజం అనేది ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగవ అంతస్తుగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకుందని వివరించారు. సమాజంలో అత్యుత్తమ విలువలతో కూడిన వ్యవస్థ ఏదైనా ఉంది అంటే అది జర్నలిజం మాత్రమేనని ఆయన అభిప్రాయపడ్డారు. అలాంటి జర్నలిజం వ్యవస్థలో ప్రస్తుతం కొన్ని మీడియా సంస్థలు కొన్ని రాజకీయ పార్టీలకు అనుబంధంగా పనిచేయడం ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ, మెజారిటీ మీడియా సంస్థలు స్వతంత్రంగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణకు నిరంతరం పాటుపడుతున్నాయని ఆయన వివరించారు. ప్రపంచంలో ఎక్కడ ఏ మూల ఏ విషయం జరిగినా దానిని కళ్లకు కట్టినట్లుగా ప్రచార, ప్రసార మాధ్యమాల ద్వారా జర్నలిస్టులు ప్రజలకు చేరవేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అలాంటి జర్నలిస్టులు విధి నిర్వహణలో సరైన సమయాల్లో ఆహారం తీసుకోవడం ,విశ్రాంతి తీసుకోవడం లాంటి విషయాలను ప్రక్కన పెట్టడంతో ఆరోగ్యపరంగా చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆయన





వివరించారు. ముఖ్యంగా పరిశోధనాత్మక జర్నలిజంలో వారు కొన్ని సందర్భాల్లో ప్రాణాలకు తెగించి విధి నిర్వహణ చేస్తారని ఇలాంటి సందర్భాల్లో వారు మానసికంగా ఆరోగ్యపరంగా ఒత్తిళ్లకు గురై అనేక ఆరోగ్యపరమైన సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆయన వివరించారు .ఈ క్రమంలోనే వారు పలు ఆరోగ్యకరమైన సమస్యలను ఎదుర్కొని చివరకు ప్రాణాల మీదికి తెచ్చుకున్న సందర్భాలు ఉన్నాయని చెప్పారు. ఇటీవల చిన్న వయసులోనే విధి నిర్వహణలో మృతి చెందిన వీడియో జర్నలిస్టు చిన్న ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ అని ఆయన వివరించారు. ఇంతటి విలువైన వ్యవస్థలో పనిచేస్తున్న జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కొనసాగాలని ,ప్రతి జర్నలిస్టు తన విధి నిర్వహణ తో పాటు వ్యక్తిగతంగా తమ కుటుంబం కోసం సమాజం కోసం ఆరోగ్యం పై కూడా ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఎంతో ఉందని చెప్పారు. సమాజంలో అందరిలాగే జనరేషలు కూడా తమ జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని, ప్రతి రోజు కనీసం ఒక గంట పాటు నడక వంటి కనీస వ్యాయామాన్ని వారు పాటించాలని ఆయన సూచించారు .దీనివల్ల ఎన్నో రకాల వ్యాధులను దూరంగా పెట్టవచ్చని చెప్పారు. అలాగే తమ ఆహారంలో ప్రతిరోజు పండ్లు కూరగాయలు వంటి వాటిని తీసుకోవడం అలవాటు చేసుకోవాలని ఆయన తెలిపారు. సమాజంలో ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వపరంగా ఇస్తున్న అక్రిడిటేషన్ లు వారి కనీస హక్కులుగా ఆయన అభివర్ణించారు .సమాజం కోసం అహర్నిశలు పనిచేస్తున్న జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణకు తన వంతు సహకారం నిరంతరం ఉంటుందని ఆయన వెల్లడించారు. జర్నలిస్టులు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా సమాజానికి మరింత మెరుగైన సేవలు అందించవచ్చని సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ వైద్య సిబ్బందితోపాటు సీనియర్ జర్నలిస్టు రామస్వామి, మహేశ్వర్ రెడ్డి (క్లస్టర్ హెడ్) డాక్టర్ ఇమ్రాన్, కొండా రెడ్డి మేనేజర్ ప్రశాంత్, (క్యాంపు ఇంచార్జి) శేషు నాయుడు, (క్యాంప్‌కోడినేటర్) లక్ష్మి పలీనా నర్సులు తదితరులు పాల్గొన్నారు.

## సమాజసేవతోనే సంతృప్తి :మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్




కర్నూలు, మార్చి 20 (శ్రీచక్ర): సమాజ సేవతోనే సంతృప్తి కలుగుతుందని మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. ప్రతి వ్యక్తి తన సంపాదనలో కొంత శాతం సమాజ సేవకు వినియోగిస్తే దేశం పురోగతి సాధిస్తుందని ఆయన అన్నారు. నూతనంగా ప్రారంభించిన ఆయత్ ఫౌండేషన్ సేవా సంస్థ లోగోను గురువారం తన నివాసంలో ఆవిష్కరించిన సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి సమాజాన్ని తన కుటుంబంలా భావించినప్పుడే ప్రగతి ఫలాలు అందుతాయని అన్నారు. పోలీసు శాఖలో విశేష సేవలు అందించిన రిటైర్డ్ డియస్పీ మహబూబ్ బాషా సమాజసేవా రంగంలోకి రావడం అభినందనీయమని అన్నారు. ఆయత్ ఫౌండేషన్ అధ్యక్షుడు మహబూబ్ బాషా మాట్లాడుతూ ఒక మంచి సమాజాన్ని నిర్మించే లక్ష్యంతో తాము ఈ సంస్థను ప్రారంభించామని అన్నారు. మారుతున్న కాలానికనుగుణంగా రాబోయే తరాల కోసం ఒక వినూత్న ప్రణాళికతో తమ కార్యాచరణను రూపొందిస్తున్నామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఆనందరావు, రామమోహన్ రెడ్డి, వెంకట్రాముడు, నాగేశ్వరబాబు, సూర్యకుమార్, జ్యోతిరాణి తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ స్టేడియంపై పొలిటికల్ గేమ్

విశాఖపట్టణం, మార్చి 20, విశాఖ క్రికెట్ స్టేడియం పేరు మార్పుపై వైఎస్సార్‌సీపీ నేతలు నానా రచ్చ చేస్తున్నారు. అటు, టీడీపీ సైతం స్ట్రాంగ్ కౌంటర్ ఇస్తుండటంతో రచ్చ రంజుగా మారింది. విశాఖ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంపై ఏపీలో పొలిటికల్ గేమ్ నడుస్తోంది. స్టేడియంకు వైఎస్సార్ పేరు తీసేయడమే లేటెస్ట్ వివాదానికి కారణం. మా నాయకుడి పేరు తొలగిస్తారంటూ వైసీపీ నేతలు తప్పుబడుతున్నారు. మేటర్ విశాఖ స్టేడియం గురించి కాబట్టి మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ రెడ్డి ఈ గొడవను లీడ్ చేస్తున్నారు. మీడియా ముందు గొంతు చించుకోవడంతో పాటు.. పార్టీ శ్రేణులతో కలిసి ప్రత్యక్ష ఆందోళనలకు రెడీ అవుతున్నారు. విశాఖ స్టేడియంకు వైఎస్సార్ పేరు తీసిపడేయడంపై సోషల్ మీడియాలో ఇరు వర్గాలు బౌన్సర్లు, సిక్సర్లతో పొలిటికల్ గేమ్ ఆడుతున్నారు. పేరు మార్చితే.. ఆ నొప్పి ఎలా ఉంటుందో ఇప్పుడు తెలిసొస్తుందా అంటూ వైసీపీని కవ్విస్తున్నారు టీడీపీ, జనసేన వారియర్స్. గతంలో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో ఎన్టీఆర్ పేరు తీసేసి.. వైఎస్సార్ అని పెట్టడాన్ని గుర్తు చేసి కామెంట్లతో కుమ్మేస్తున్నారు. 1986లో హెల్త్ యూనివర్సిటీని స్థాపించిందే అప్పటి సీఎం నందమూరి తారకరామారావు అందుకే, ఆయన పేరు మీద ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ అని పెట్టడంలో లాజిక్ ఉంది. అలాంటి ఎన్టీఆర్ పేరును తీసేసి.. గత సీఎం జగన్ తన తండ్రి పేరుతో వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీగా పేరు మార్చిన మేటర్ ను ఇప్పుడు మళ్లీ తెరమీదకు తెస్తున్నారు. ఆనాడు ఆయన చేసింది తప్పు కానప్పుడు.. ఇప్పుడు విశాఖ క్రికెట్ స్టేడియంకు వైఎస్సార్ పేరు తీసేయండం కూడా తప్పు కాదని వాదిస్తున్నారు. వైజాగ్ స్టేడియం వైఎస్సార్ ఏమైనా కట్టించాడా? ఆయన పేరు ఎందుకు పెట్టారంటూ గట్టి ఫైటే నడుస్తోంది సోషల్ మీడియాలో. అది ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కు సంబంధించిన స్టేడియం కాబట్టి ౦అ౦ పేరు మీదుగా ఉండటమే కరెక్ట్ అంటూ వైసీపీకి స్ట్రాంగ్ కౌంటర్లు పడుతున్నాయి. పేరులో ఏముందిలే అని పంతానికి పోకుండా.. పవర్ లేనప్పుడు సైలెంట్‌గా పడుండాలి

## నేర్చుకున్న అక్షరం శాశ్వతంగా ఉంటుంది




కర్నూలు, మార్చి 20 (శ్రీచక్ర): విజన్ లో చేరితే విజయం వరిస్తుంది. నూతన బ్రాంచ్ ప్రారంభం కాబోతోంది. ప్రతి ఒక్కరు ఉన్నంతకాలం తమ జీవితంలో ఆస్తులను సంపాదిస్తే ఉంటాయో లేదో తెలియదు గాని నేర్చుకున్న అక్షరం శాశ్వతంగా ఉంటుందని రోజా మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత తెలిపారు. గురువారం కర్నూలు నగరంలోని 48 వార్డు రోజా వీధి లో విజన్ కళాశాల సిబ్బందితో రోజా మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలతతో కలిసి రోజా వీధి ప్రకాష్ నగర్ దౌలత్ నగర్ లలో ఇంటింటి కి వెళ్లి విజన్ కళాశాలలో చేరాలని కరపత్రాలను అందించారు. మీసాల సుమలత మాట్లాడుతూ విజన్ కళాశాలలో అనుభవ జ్ఞానులైన ఉపాధ్యాయుల చేత విద్యా బోధన అందిస్తున్నారని,10 వ తరగతి పాసైన పిల్లలందరూ విజన్ కళాశాలలో చేర్చి విజయం సొంతం చేసుకోవాలని మీసాల సుమలత కోరారు.

## ఎమ్మెల్యే బీవీ ఆదేశాల మేరకు ఈద్గాలో పనులు ప్రారంభం

ఎమ్మిగనూరు,మార్చి 20 (శ్రీ చక్ర):- పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఎమ్మెల్యే బీవీ. జయ నాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఈద్గాలో మరమ్మత్తు పనులు ప్రారంభమయ్యాయని టిడిపి మైనారిటీ నాయకులు హుసేన్ పీరా, బందే నవాజ్, తురేగల్ నజీర్ అహమ్మద్, షాబీర్, సలీమ్ లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే బీవీ ఆదేశాల మేరకు ఈద్గాలో జరుగుతున్న పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ సందర్భంగా ఈద్ నమాజ్ కు వచ్చే ప్రతి ముస్లిం సోదరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శ్రీచక్ర
SREECHAKRA TELUGU DAILY
శుక్రవారం 21-03-2025

# డి.ఎన్ .ఆర్ ఇంజినీరింగ్ కళాశాల లో ఇన్ఫినిటీ 2 ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ.




భీమవరం మార్చి 20( శ్రీచక్ర) స్థానిక డి.ఎన్ .ఆర్ఇంజినీరింగ్ కళాశాల బేసిక్ సైన్స్ ఢ హ్యూమానిటీస్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యం లో ఈ నెల 22 తేదీన అనగా శనివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ ఫెస్ట్ నిర్వహిస్తున్నాము అని కళాశాల ప్రిన్సిపల్ డా.ఎం.అంజన్ కుమార్ గురువారం తెలిపారు .ఈ సందర్భంగా ఇన్ఫినిటో 2 .ా ఫెస్ట్ పోస్టర్ని కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణ రాజు (బాబు) ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ కళాశాల లో ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్న మొదటి సంవత్సరం విధ్యార్థులకు వారి ప్రతిభను ప్రదర్శించటానికి మరియు సాంకేతిక నూతన నైపుణ్యాలను నేర్చుకోటానికి ఒక అద్భుతమైన వేదిక ఈ ఇన్ఫినిటో 2 .ా ఫెస్ట్ అని అన్నారు . ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డా.ఎం.అంజన్ కుమార్ గారు మాట్లాడుతూ ఈ ఇన్ఫినిటో 2.ా టెక్ ఫెస్ట్ లో ప్రాజెక్ట్ ఎక్స్పో , పోస్టర్ ప్రెసెంటేషన్, జమ్ (ఎక్సటెంపో ) వంటివి నిర్వహిస్తున్నాం అని తెలిపారు . బిటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న వివిధ కళాశాలో విద్యార్థులు ఈ టెక్ ఫెస్ట్ లో పాల్గొని జయప్రదం చేయవలెను అని అన్నారు . మొదటి సంవత్సరంవిభాగాధిపతి కన్వినర్ డా.జి.జి. రత్నం మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సాంకేతిక నైపుణ్యాలను ,సృజనాత్మకతను పోటీతత్వమను బయటికి తీయటానికి , వారు నేర్చుకోటానికి వినూత్న ఆలోచలను ప్రదర్శించటానికి జ్ఞానము ను పెంపొందిచటానికి, ఈ టెక్ ఫెస్ట్ ఉ పయోగపడుతుంది అని అన్నారు. కావున వివిధ ఇంజినీరింగ్ కళాశాల లో మొదటి సంవత్సరంచదువుతున్న విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు . ఈ కార్యక్రమం లో వివిధ విభాగాల అధిపతులు డీన్స్ , టెక్ ఫెస్ట్ సమన్వాయ కర్తలు స్టూడెంట్ వాలాంటేర్ పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2025.




భీమవరం మార్చి 19 (శ్రీ చక్ర ) పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల స్థాయి "వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2025" ఈ నెల 24 మరియు 25 వ తేదీలలో నిర్వహించడానికి నోడల్ కళాశాల గా డి.ఎన్.ఆర్. కళాశాలను కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఎన్నిక చేసినదని, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల నుండి వచ్చిన 454 మంది వీడియోలను పరిశీలించి వారిలోనుండి 150 మందిని ఎంపిక చేయడం జరిగినదని కళాశాల ప్రిన్సిపాల్ జి.మోజెస్ గ తెలియచేసారు. జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ కార్యక్రమముకు ఎంపికైన అభ్యర్థులు వన్ నేషన్ వన్ ఎలక్షన్ పయింగ్ దా వే ఫర్ వికసిత్ భారత్ : అనే అంశము పై మూడు నిమిషముల పాటు మాట్లాడవలసి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమములో డి.ఎన్.ఆర్. కళాశాల ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఎస్. అనిల్ దేవ్ , కె. సోమయ్య పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాలతో పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టిన జిల్లా పోలీస్ అధికారులు.

రాజమండ్రి మార్చ్ 20(, శ్రీ చక్ర)× జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ..జిల్లా లోని రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలో గల తొర్రేడు గ్రామం నందు బుధవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమాన్ని జిల్లా ఎడిషన్ ఎస్పి(లా అండ్ ఆర్డర్) అల్లూరి వెంకట సుబ్బరాజు నిర్వహించారు.ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ .. ప్రజలతో ప్రత్యేకంగా సమావేశమై ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాల గురించి అవగాహన కల్పించి ఆ ప్రాంతంలో నివాసముండే చెడు నడత కలిగిన వ్యక్తులు యొక్క సమాచారాన్ని ప్రజల నుండి సేకరించారు. గ్రామ పెద్దల తో వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల గురించి, బాల్య వివాహాలు ,డయల్ 112, శక్తి యాప్, సోషల్ మీడియా, రోడ్డు భద్రతా నియమాలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానికంగా జరుగుతున్న చట్ట వ్యతిరేక కార్యకలాపాల గురించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు "పల్లెనిద్ర" కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకొని వస్తే వాటిని చట్ట పరిధిలో పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ పల్లెనిద్ర కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ (రాజానగరం) వీరయ్య గౌడ్ , సబ్ ఇన్స్పెక్టర్ మనోహర్, ఇతర పోలీసు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




# రాష్ట్ర ముఖ్యమంత్రి తణుకు పర్యటనలో భాగంగా ఇచ్చిన హామీకై పరుగులు పెట్టిన అధికారులు...

ఫోటో ఆధారంగా రెవెన్యూ, పోలీస్ సిబ్బంది తణుకు చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రతి ఇల్లు జల్లెడ పట్టి బాధితురాలని వెతికి పట్టుకున్న వైనం..

ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఒక లక్ష రూపాయలు బాధిత మహిళకు అందజేత...

ముఖ్యమంత్రి దయార్ద్ర హృదయానికి కృతజ్ఞతలు తెలిపిన బాధిత మహిళ.

ఏసమ్మ బాధకు ఉపశమనం .. ఒక లక్ష రూపాయలు చెక్కును సీఎంఆర్ఎఫ్ నిధుల నుండి అందుచేత.. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



భీమవరం మార్చి 20( శ్రీ చక్ర )పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణంలో మార్చి 15న స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును సభ అనంతరం ప్రధానంగా తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన నందివాడ ఏసమ్మ ఆమె కుమారుడుతో కలిసి కొడుకు వాస్తవ పరిస్థితిని చూపిస్తూ, నా కుమారుడు మానసిక వికలాంగత్వంతో సరిగ్గా నడవలేని, మాట్లాడలేని, ఏ విషయం తెలియ చెప్పలేని పరిస్థితిలో ఉన్నాడని, 17 సంవత్సరాలుగా బిడ్డను సాకడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని, 14 సంవత్సరాల క్రితమే భర్తను కూడా కోల్పోయానని ముఖ్యమంత్రి వద్ద బోరున విలపిస్తూ కన్నీటి పర్యాంతమైంది. కనీసం వికలాంగుల పెన్షన్ అయినా మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని నోటి మాటగ మాత్రమే కోరడం జరిగింది. సీఎం చర్యలు తీసుకుంటాను అని ఆమెకు బదులు ఇవ్వడం, సభ ముగిసిపోవడంతో అందరూ వెళ్లిపోవడం జరిగింది. ఆమె ఎదుర్కొంటున్న ప్రత్యేక పరిస్థితులను గమనించిన రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్ ను ఆదేశిస్తూ ఒక లక్ష రూపాయలు వారి బిడ్డ పేరున డిపాజిట్ చేసేందుకు సీఎంఆర్ఎఫ్ నిధులు నుండి మంజూరు చేయాలని ఆదేశించడం జరిగింది. సదరు మహిళ ఏ విధమైన దరఖాస్తు అంద చేయకపోవడంతో ఆమె వివరాలు ఏమీ లేక, ఆమె ఫోటో ఆధారంగా ఆచూకీ తెలుసుకోవడానికి పోలీస్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది రెండు రోజులు చుట్టుపక్కల గ్రామాలన్నీ జల్లెడ పట్టి ఎట్టకేలకు సదన మహిళ ఆచూకీ కనుగొనడం జరిగింది. ఆమెకు, ఆమె బిడ్డకు సహాయకంగా విఆర్ఏను జత చేసి భీమవరం కలెక్టరేట్ కు తీసుకొచ్చి ఒక లక్ష రూపాయల చెక్కును గురువారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా అందజేసి, చెక్కను డిపాజిట్ చేసి పాస్ బుక్ ను అందజేయడానికి చర్యలు తీసుకోవాల్సిందిగా తహసిల్దార్ ను ఆదేశించడం జరిగింది. ఈ సందర్భంగా బాధిత మహిళ నందివాడ ఏసమ్మ మాట్లాడుతూ నాకు ఇద్దరు పిల్లలు అని నా భర్త 2011లో కామెర్లు కారణంగా చనిపోయారని అప్పటినుండి ఇళ్లల్లో పని చేసుకుంటూ దివ్యంగుడైన నా కుమారుడితో జీవిస్తున్నానని, నాకు వితంతు పెన్షన్ గాని, నా కుమారునికి వికలాంగ పెన్షన్ గాని మంజూరు కాలేదని, నివాసానికి ఇల్లు కూడా లేదని జిల్లా కలెక్టర్ వద్ద ఆవేదన వ్యక్తం చేయగా పెన్షన్ మంజూరుకు ప్రాధాన్యతనిస్తూ చర్యలు తీసుకుంటామని, ఇళ్ల స్థలం కేటాయించి గృహ నిర్మాణం చేయడానికి కూడా చర్యలు తీసుకుంటామని తెలుపుతూ తహసిల్దార్ ను ఆదేశించడం జరిగింది. ఈ సందర్భంగా నందివాడ ఏసమ్మ మాట్లాడుతూ సీఎంగారు దయార్ద్ర హృదయంతో చేసిన సహాయం ఎన్నటికీ మరువలేనిదని, ఇంత మొత్తం నేను చూసింది కూడా లేదని, నేను కేవలం నా కుమారుడి పెన్షన్ మంజూరు కోసం మాత్రమే ముఖ్యమంత్రికి విన్నవించడం జరిగిందని, ఒక లక్ష రూపాయలు కూడా అందజేయడం నా జీవితంలో ఊహించలేనిదని, నా కుమారుడిని ఎలా సాకాలో, నేను లేని రోజుననా కుమారుని పరిస్థితి ఏమిటో అని ఎల్లప్పుడూ మదన పడుతూ ఉండేదాన్ని అని, నేటితో నా భారం అంతా ముఖ్యమంత్రి చేసిన సహాయంతో తొలగిపోయిందని చాలా సంతోషాన్ని, కృతజ్ఞతలను వ్యక్తం చేశారు. చెక్కును అందజేస్తున్న సందర్భంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, తాడేపల్లిగూడెం ఆర్డీవో కతిబ్ కౌసర్ భానో, తణుకు తహసిల్దార్ డివివిఎస్ అశోక్ వర్మ, వీఆర్ఏ వున్నారు....

# ఎస్ ఆర్.కె.ఆర్. ఇంజనీరింగ్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ,



భీమవరం మార్చి 20( శ్రీచక్ర )ప్లాస్టిక్ వాడకం ద్వారా పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని, క్యాన్సర్ వ్యాధి కారకాలైన ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించడానికి పూర్వం మన పెద్దలు ఉపయోగించిన గుడ్డ సంచులు ,నారసంచులు, లోహాలతో తయారుచేసిన గ్లాసులు, వినియోగంలోకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని తద్వారా ప్లాస్టిక్ రహిత భీమవరంగా లక్ష్యాన్ని చేదిద్దామని భీమవరం, మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి అన్నారు. భీమవరం టూ టౌన్ లోని ఎస్ ఆర్.కె.ఆర్. ఇంజనీరింగ్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ, అవగాహన సదస్సు, క్లాత్ బ్యాగులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు భూపతి రాజు సత్యనారాయణ రాజు, అధ్యక్షులు గ్రంధి కుమార వెంకటేశ్వర ప్రసాద్, సంఘ సేవకులు అల్లు శ్రీనివాసులు మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా, ప్రధాన కేంద్రమైన భీమ వరం పట్టణంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి చదల వాడ నాగరాణి ఆదేశాల మేరకు మున్సిపల్ తదితర శాఖల వారి ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థలు ,సంఘాల సహకారంతో ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్లాస్టిక్ వాడకం వల్ల వచ్చే నష్టాలను తెలియ చేస్తున్నారని, మా వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 100 మందికి క్లాత్ బ్యాగులు పంపిణీ చేశామని, ప్లాస్టిక్ నిషేధ కార్యక్రమానికి, పర్యావరణ పరిరక్షణ లో మా వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఆ.ఐ. పుల్లంరాజు, కార్యదర్శిఆ. శ్రీధర్ రాజు,కోశాధికారి ఖ. పీటర్, గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు, గొట్టుముక్కల భీమరాజు ,దాట్ల సూర్యనారాయణ రాజు(ఆ.ా.ఖీ.), పెనుమెత్స వెంకట్ రాజు, యాస ఆంజనేయులు, కొల్లా రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

# రబీ సీజన్లో రైతుల వద్ద ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం కావాలి

**- జిల్లా జాయింట్ టి.కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి**



భీమవరం మార్చి 20,(శ్రీ చక్ర)గురువారం జిల్లా కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరం నందు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి రబీ (దాళ్వా) ధాన్యం కొనుగోళ్లపై ధాన్యం సేకరణ కమిటీ సభ్యులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాల ద్వారా ధాన్యం కొనుగోళ్లపై గ్రామస్థాయిలో రైతులందరికీ పూర్తి అవగాహన కల్పించడం జరిగిందని, అలాగే కనీసం మద్దతు ధర వివరాలను కూడా తెలియజేయడం జరిగిందన్నారు. కనీస మద్దతు సాధారణ రకం క్వింటాల్ కు రూ.2,300/- లు, గ్రేడ్-ఏ రకం రూ.2,320/- లు మద్దతు ధర కల్పించడం జరిగిందని తెలిపారు. నాణ్యత ప్రమాణాలు లోబడి ముఖ్యంగా తేమ శాతం 17 కన్న తక్కువ ఉండేటట్లు బాగా ఆరబెట్టి శుద్ధి చేసుకోని రైతు సేవ కేంద్రమునకు తీసుకువచ్చే విధంగా సంబంధిత శాఖల అధికారులు రైతులందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ రైతు ప్రభుత్వం కల్పించిన కనీస మద్దతు ధర కన్నా తక్కువ రేట్ కి అమ్ముకోకూడదని స్పష్టం చేశారు. ఒకవేళ బహిరంగ మార్కెట్లో ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర కన్నా ఎక్కువ రేటు వస్తే రైతులు అమ్ముకోవడానికి అభ్యంతరం లేదన్నారు. ప్రతి రైతు సేవా కేంద్రంలో తగినంత సిబ్బందిని నియమించి వారికి పూర్తిస్థాయిలో శిక్షణను అందించాలని, ధాన్యం కొనుగోలులో ఎటువంటి సమస్యలు లేకునీడా రైతులకు సేవలు అందించాలని ఆదేశించారు. రైతు సేవా కేంద్రాల్లో ఉండవలసిన పరికరాల సిద్ధంగా ఉండేలా చూసుకోవడంతో పాటు రైతు సేవా కేంద్రానికి సంబంధించిన గోనె సంచులు, అమాలీలు, రవాణాకు సంబంధించిన వాహనాలు, అందుబాటులో ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలుకు కావలసిన తగినన్ని ఏర్పాట్లు ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. జిల్లాస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఆయా గ్రామాల పరిధిలో ధాన్యం దిగుబడిని అంచనాకు అనుగుణంగా మండల, గ్రామస్థాయిలో ఉన్న సిబ్బందితో ప్రణాళికలను సిద్ధంచేసి ధాన్యం కొనుగోలుకు ఇబ్బంది లేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో సివిల్ సప్లైస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ టి.శివరాం ప్రసాద్, డీఎస్ఓ ఎన్.సరోజ, జిల్లా సహకార శాఖ అధికారి ఎం.నాగరాజు, జిల్లా రవాణా శాఖ అధికారి బి.ఉమామహేశ్వరరావు, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ వివి నాగరాజారావు, మార్కెటింగ్ ఏడి కె.సునీల్ కుమార్, ఏఎస్ఓ ఎం.రవిశంకర్, వ్యవసాయ శాఖ అధికారి ప్రియదర్శిని, జిల్లా రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షులు సామంతపూడి శ్రీరామరాజు, సెక్రెటరీ కె. శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆదరణ-3 సద్వినియోగం చేసుకోవాలి:మున్సిపల్ కమిషనర్ నాయుడు.



రామచంద్రపురం, మార్చి 20 (శ్రీచక్ర)ప్రభుత్వం వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన ఆదరణ 3 ని సద్వినియోగం చేసుకోవాలని రామచంద్రపురం మునిసిపల్ కమిషనర్ విఐవి నాయుడు పేర్కొన్నారు.ఈమేరకు గురువారం ఆదరణ-3 పథకంలో భాగంగా కుల వృత్తి దారులకు మున్సిపాలిటీ పరిదిలో సమావేశం నిర్వహించారు. ఆధునిక పనిముట్ల నాణ్యత , కంపెనీ ఏజెన్సీ వివరాలు సేకరించాలని బి.సి కార్పొరేషన్ ఆదేశించినట్లు ఈసంధర్భంగా పేర్కొన్నారు. రామచంద్రపురానికి చెందిన వివిధ కుల వృత్తి సంఘాలకు చెందిన వారితో కమీషనరు పురపాలక సంఘం కార్యాలయం సమావేశం నిర్వహించారు. కుల వృత్తి దారులకు ఏయే ఆధునిక పనిముట్లు కావలో తదితర వారి నుండి వివరాలు తీసుకొన్నారు. తీసుకున్న వివరాలు బి.సి కార్పొరేషన్ కు తెలియజేస్తామని కమిషనర్ తెలిపారు. కుల వృత్తి సంఘాల ప్రతినిధులు, వెల్ఫేర్ సెక్రటరీలు , మేనేజర్ మూర్తి , బొమ్మల శ్రీనివాసు తదితరులు ఈసమావేశంలో పాల్గొన్నారు.



## సర్పంచ్ ఆధ్వర్యంలో వాటర్ లీకేజీలకు మరమత్తులు



రామచంద్రపురం, మార్చి 20(శ్రీచక్ర)రామచంద్రపురం మండలం హసన్ బాద గ్రామంలోవాటర్ లీకేలకు మరమత్తు పనులు చేపట్టారు . ఈమేరకు గురువారం సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు జల జీవన్ మిషన్ పనులలో భాగంగా గ్రామంలో అక్కడక్కడ ఉన్న వాటర్ లీకేజీలను పరిశీలించారు . తరువాత జల జీవన్ మిషన్ సిబ్బందితో వాటర్ లీకేజీలను దగ్గరుండి సర్పంచ్ సతీష్ రావు అరికట్టంచారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సతీష్ రావుతోపాటు ,వార్డు సభ్యులు కత్తుల భాలకృష్ణ,పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మిడ్డే మీల్స్ ను సక్రమంగా నిర్వహించాలి కోట ఎమ్ ఈ ఓ దారా.మస్తానయ్య



కోట మార్చి 20 (శ్రీచక్ర) : ప్రభుత్వ పాఠశాలలో మిడ్డే మీల్స్ నిర్వహణ సక్రమంగా ఉండాలని కోట ఎంఈఓ దారా.మస్తానయ్య తెలిపారు. ఈ సందర్భంగా గురువారం కోట మండలంలోని గూడలి పంచాయతీ పరిధిలో ఉన్న చంద్రశేఖరపురం లోని మండల ప్రజా పరిషత్ పాఠశాలను పరిశీలించారు. మొట్టమొదట పాఠశాలలో ఉన్న పలు రికార్డులను పరిశీలించి పాఠశాలలోని స్థితిగతులను ప్రధానోపాధ్యాయురాలు వేలాంగణి ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులు యొక్క సామర్థ్యాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అంతేకాకుండా విద్యార్థులకు అందించే మిడ్డే మీల్స్ నిర్వహణ యొక్క విధివిధానాలను ఆరా తీశారు.

## బీసీ గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష కు దరఖాస్తు గడువు పొడిగింపు

కోట మార్చి 20 (శ్రీచక్ర ) : మహాత్మా జ్యోతిభాపూలే బీసీ గురుకుల పాఠశాల,కళాశాల నందు చేరుటకు సొసైటీ వారు నిర్వహించే ప్రవేశపరీక్ష కు దరఖాస్తు చేసుకొనుటకు ఈ నెల 25 వ తేది వరకు పొడిగించినట్లు బీసీగురుకులపాఠశాల,కళాశాల ప్రిన్సిపాల్ కే.నారాయణ రావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విద్యా సంవత్సరం 2024-25 లో ఏదైనా పాఠశాల నందు4వతరగతి,10 వ తరగతి విద్యార్థులకు కోట బీసీ గురుకులంలో5వతరగతి,ఇంటర్చేరుటకు దరఖాస్తు చేసుకోవచ్చునని, అదేవిధంగా ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 27 వ తేది నిర్వహించడం జరుగుతుందని పాఠశాల,కళాశాల ప్రిన్సిపాల్ కే.నారాయణ రావు తెలియజేశారు.

## నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

**విద్యుత్ సమస్యల పరిష్కారానికే ప్రత్యేక విద్యుత్ అదాలత్**



కోట మార్చి 20 (శ్రీ చక్ర ) : మండలంలోని విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును అందించడమే ప్రధాన లక్ష్యం అని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్ పర్సన్ రిటైర్డ్ జడ్జ్ వి శ్రీనివాస్ ఆంజనేయ మూర్తి అన్నారు. ఈ సందర్భంగా గురువారం కోట మండలంలోని చెందోడు విద్యుత్ సబ్ డివిజనల్ కార్యాలయంలో విద్యుత్ సమస్యలపై స్థానిక విద్యుత్ శాఖ గూడూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.వి నరేందర్ రెడ్డి,ఏ డి ఈ చిన్నయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో రైతులకు,ప్రజలకు సంబంధించి విద్యుత్ సమస్యలైనా లూజ్ లైన్ లు,విరిగిన విద్యుత్ స్తంభాలు మార్పు,నూతన విద్యుత్ కనెక్షన్లు, తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అదేవిధంగా ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమంలో వచ్చిన పలు అర్జీలకు త్వరితగతిన అక్కడికక్కడే సమస్యలకు పరిష్కారం చూపారు. ఇలాంటి విద్యుత్ సమస్యలను ప్రతి గ్రామంలో విద్యుత్ సమస్యల రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామన్నారు. పీఎం సూర్య ఘర్ (సౌర విద్యుత్తు శక్తి పై) ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ వి.శ్రీనివాస ఆంజనేయ మూర్తి,ఆర్థిక సభ్యులు కే.రామ్మోహన్ రావు,సాంకేతిక సభ్యులు ఎస్ వెల్ అంజనీ కుమార్,స్వతంత్ర సభ్యులు డబ్ల్యు విజయలక్ష్మి, ఏపీఎస్పీడీసీఎల్ గూడూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కెవి. నరేంద్ర రెడ్డి,విద్యానగర్ సబ్ డివిజనల్ ఏ డి ఈ చిన్నయ్య, కోట,వాకాడు,చిట్టమూరు చెందోడు ఏఈలు శశికళ,తేజ,విజయలక్ష్మి,పోలయ్య, చెందేడు సబ్ స్టేషన్ లైన్మెన్ శేషు,తదితర విద్యుత్ కార్యాలయ సిబ్బంది రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# కసాయి తండ్రి అరెస్టు-రిమాండ్ కు తరలింపు.డిఎస్పీ రఘువీర్ వెల్లడి




రామచంద్రపురం, మార్చి 20(శ్రీచక్ర)తన కన్న కుమార్తెను కుమారుడును చంపితాను ఆత్మహత్య చేసుకోవాలనుకున్న కసాయి తండ్రి పిల్లి రాజును అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు రామచంద్రపురం డిఎస్పీ రఘువీర్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన విలేకరుల సమావేశంలో గురువారం పలు విషయాలు వెల్లడించారు. రాయవరం మండలం వెంటూరు గ్రామానికి చెందిన పిల్లి రాజు అప్పుల బాధలు తాళలేక తన కుమార్తె, కుమారుడును ,చంపి తాను చనిపోవాలని ఉద్దేశంతో నెలపత్తిపాడు శివారు గణపతి నగర్ కాలవలో కొడుకు రామ్ సందీప్ 10 సంవత్సరాలు కూతురు కారుణ్య ఏడు సంవత్సరాలు ఇద్దరిని కాలువలోకి తోసివేసాడు . వీరు ఇరువురు రామచంద్రపురం పట్టణం భాష్యం స్కూల్లో చదువుతుండగా స్కూల్ నుండి ఇంటికి తీసుకెళ్తాను అంటూ నమ్మబలకి కుమారుడు సందీప్ ,కుమార్తె కారుణ్యలను ఇరువురిని కాలువలోకి తోసి వేసాడు. దీంతో కుమారుడు కర్ర సాయంతో ఈదుకుంటూ పైకి వచ్చి ప్రాణాలు రక్షించుకున్నాడు. కుమార్తె కారుణ్య ఈత రాకపోవడంతో మునిగి చనిపోయింది అనంతరం నిందితుడు సంఘటన స్థలం నుండి పరారీ యానం వెళ్లి యానం బ్రిడ్జిపై తన స్కూటీని పెట్టి ఆత్మహత్య ప్రయత్నం చేసినట్లు అనంతరం మనసు మార్చుకున్న అతను తన బంధువులు ఇంటికి రాజానగరం మండలం రాధేయపాలెం వెళ్లి విషయాన్ని బంధువులకు చెప్పగా వారు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు దీంతో రామచంద్రపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం వెంకటనారాయణ తన సిబ్బందితో కలిసి వెళ్లి నిందితుడిని అదుపులో తీసుకుని రామచంద్రపురం తీసుకువచ్చారు. భారతీయ నేర శిక్షాస్మృతి 103 ,109 సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు .20వ తేదీ గురువారం కోర్టులో హాజరు పరిచి రిమాండ్కుపంపనట్లు రామచంద్రపురం డి.ఎస్.పి రఘువీర్ వెల్లడించారు ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటనారాయ ణ రామచంద్రపురం ఎస్ఐ నాగేశ్వరరావు ద్రాక్షారామ ఎస్ఐ లక్ష్మణ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. పెద్దలు కష్టాలకు పిల్లలను బలిచేయకండీ- డిఎస్పీ. ఇదిఇలాఉండగా పెద్దలు చేసిన తప్పులకు అభం శుభం తెలియని పిల్లలను బలి చేయవద్దని డిఎస్పి రఘువీరు సూచించారు. ఎవరైనా ఇలాంటి కష్టాల్లో గాని, ఏ విధమైన ఆర్థిక పరిస్థితుల్లో క్షణకావేశంతో ఇలాంటి పనులు చేయవద్దనైనా ఈ సందర్భంగా కోరారు. ఇలాంటి వ్యక్తులు ఎక్కడైనా ఏ సందర్భంలో అయినా ఇబ్బందులు పడితే తమ దృష్టికి తీసుకురావాలని సాధ్యమైనంత వరకు ఆ సమస్యలను పరిష్కరించేందుకు తాము కృషి చేస్తామని డిఎస్పి ఈసంధర్భంగా ప్రజలకు సూచించారు.

# పెద్దిరెడ్డికి వరుస కష్టాలు

తిరుపతి, మార్చి 20, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాజకీయ పునాదులు కదులుతున్నాయి. మొసలికి నీళ్లలో బలం ఉన్నట్టు.. పుంగనూరు అడ్డాగా దశాబ్దాలుగా పెద్దిరెడ్డిదే పెత్తనం కొనసాగింది. మైనింగ్ నుంచి లిక్కర్ వరకు.. ఆయనదే హవా. ఆయన చెప్పిందే శాసనం. కను సైగలతో పుంగనూరు నియోజకవర్గాన్ని, ఉమ్మడి చిత్తూరు జిల్లాను ఏలారు పెద్దిరెడ్డి. ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం పతనం కావడంతో.. పెద్దిరెడ్డి పాపాల పుట్ట పగులుతోంది. వరుస కేసులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రెడ్ బుక్ పేర్లను బయటకు తీస్తుండటంతో.. పెద్దిరెడ్డితో పాటు ఇన్నాళ్లూ ఆయన అడుగులకు మడుగులు ఒత్తిన కొందరు ఖాకీల కూసాలు సైతం కదులుతున్నాయి. తాజాగా జరిగిన ఓ మర్డర్.. చిత్తూరు పోలీస్ డిపార్ట్మెంట్నే షేక్ చేసింది. ఇన్నాళ్లూ పొలిటికల్ పెద్దలకు ఊడిగం చేసిన పోలీసుల స్థానాలు మారాయి. పనిలో పనిగా.. చిత్తూరు జిల్లా యంత్రాంగం మొత్తాన్ని ప్రక్షాళన చేస్తోంది పోలీస్ శాఖ. ఒకరు, ఇద్దరూ కాదు. ఏకంగా చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఏకంగా 264 మంది పోలీసులను రాత్రికి రాత్రే బదిలీ చేసింది ప్రభుత్వం. కౌన్సిలింగ్ గట్రా లేకుండా.. ఒక్క ఆర్డర్తో అందరినీ ఆర్డర్ లో పెట్టింది. జిల్లాలోని ప్రతీ పీఎస్లోనూ ట్రాన్స్ఫర్స్ జరిగాయి. పుంగనూరు పోలీస్ స్టేషన్ లో ఏకంగా 20 మందిపై వేటు పడింది. పుంగనూరు నియోజకవర్గం వ్యాప్తంగా 60 మంది ఖాకీలు బదిలీ అయ్యారు. తీవ్ర ఆరోపణలు ఉండి, పెద్దిరెడ్డి మనుషులుగా ముద్ర ఉన్న సిబ్బందిని సుదూర ప్రాంతాలకు పంపించారు. కొందరిని కుప్పం, రాళ్ల బూదుగూరుల ఖూలకు బదిలీ చేశారు. చిత్తూరు మహిళా స్టేషన్లో పని చేస్తున్న వారికి, రిటైర్మెంట్కు దగ్గరలో ఉన్న పలువురికి.. పుంగనూరులో పోస్టింగ్ ఇచ్చారు. ఇంతటి సంచలన నిర్ణయానికి కారణం ఇటీవల చిత్తూరులో జరిగిన టీడీపీ కార్యకర్త రామకృష్ణ దారుణ హత్య. ఈ మర్డర్ ను ప్రభుత్వం సీరియస్ గా తీసుకుంది. ఇంకా వెయిట్ అండ్ సీ విధానం సరికాదని.. బదిలీ కొరడా ఝులిపించింది. ఏకకాలంలో.. ఏకంగా 264 మంది పోలీసులను బదిలీ చేయడం మాత్రం మామూలు విషయం కానే కాదు. శాంతిభద్రతల మేటర్ లో సర్కారు ఎంత సీరియస్ గా ఉందో చెప్పకనే చెప్పింది. చిత్తూరు జిల్లాలో పోలీసుల పని తీరుపై ప్రభుత్వం కొంతకాలంగా తీవ్ర అసంతృప్తితో ఉంది. శాంతిభద్రతల విషయంలో పోలీసులు చాలా నిర్లక్ష్యంగా ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి. టీడీపీ నేతలపై దాడులు జరుగుతున్నా పోలీసులు పట్టనట్టు ఉంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అందుకే.. ఈ సంచలన నిర్ణయం అంటున్నారు. కానిస్టేబుల్ లతో పాటు సీఐ, ఎస్సై స్థాయి అధికారులు కూడా ఈ లిస్ట్ లో ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో పని చేసిన నర్సింహులు అనే ఎస్సై తీరు తీవ్ర వివాదాస్పదమైంది. ఆనాటి పెద్దల అండ చూసుకుని రెచ్చిపోయాడని అంటారు. ఓ ఎన్నారైని అక్రమ అరెస్ట్ చేసి.. అతను విదేశాలకు వెళ్లకుండా అడ్డుకున్నాడని.. అతని నుంచి 3 లక్షలు బలవంతంగా వసూల్ చేశారనే ఆరోపణ ఉంది. అంటారు. ప్రభుత్వం మారాక ఆ అరాచక ఎస్సై నర్సింహులుపై సస్పెన్షన్ వేటు పడింది. లేటెస్ట్ గా.. 264 మంది పోలీసుల బదిలీలతో.. పుంగనూరుతో పాటు చిత్తూరు జిల్లా వ్యాప్తంగా లా అండ్ ఆర్డర్ ను ఆర్డర్ లో పెట్టే పని ప్రారంభించింది. ఈ బదిలీల వేటుతో పరోక్షంగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పెత్తనానికి చెక్ పెట్టినట్టేనని అంటున్నారు. రెడ్ బుక్ ఎఫెక్ట్ ఎట్టా ఉంటాదో ఇప్పటికైనా పెద్దిరెడ్డికి తెలిసొచ్చుంటుందిగా? పోలీసులు సరే.. మరి నెక్స్ట్ టార్గెట్ పెద్దాయనేనా?

## తాడేపల్లి సచివాలయం వద్ద గూడూరు ఎమ్మెల్యే ని కలిసిన కోట టిడిపి నాయకులు



కోట మార్చి 20 (శ్రీ చక్ర ) : కోట పట్టణ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన కోట మండల తెలుగుదేశం నాయకులు గురువారం తాడేపల్లి సచివాలయంలో గూడూరు నియోజక వర్గ శాసనసభ్యులు డాక్టర్ పాశిం.సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కోట మండలం కోట పట్టణ ప్రజా సమస్యలను సంబంధిత మంత్రివర్యులకు,ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తిరుపతి పార్లమెంటు మైనార్టీ అధ్యక్షులు షేక్. జలీల్ అహ్మద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ తెలుగుదేశం మైనార్టీ అధ్యక్షులు షేక్. జలీల్ అహ్మద్,వెంకన్నపాలెం సర్పంచ్ కోకర్ల.మధు యాదవ్,కోట ఎంపీటీసీ లు దారా.సురేష్,షేక్.షంషుద్దీన్ పాల్గొన్నారు

## తిరుమల క్యూలైన్ వద్ద ఘర్షణ

**పరస్పరం వాగ్వాదంలో ఒకరికి గాయాలు**

తిరుమల,మార్చి 20(ఆర్ఎన్ఎ): తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చిన భక్తుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. అది కాస్తా ఘర్షణగా మారింది. చివరకు ఓ భక్తుడు ఆసుపత్రి పాలయ్యాడు. గురువారం తిరుమలలోని సీఆర్వో కార్యాలయం వద్ద భక్తులు క్యూ లైన్లో నిల్చునున్నారు. ఆ క్రమంలో తన కుమారుడిని తోసిన వ్యక్తిపై అతడి తండ్రి ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఆ క్రమంలో ఇద్దరి మధ్య మాట మాట పెరిగింది. దీంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. అదే సమయంలో క్యూ లైన్లోని వ్యక్తులంతా కలిసి... యువకుడి తండ్రిని కొట్టారు. దీంతో ఆగ్రహించిన ఆ తండ్రి.. తన చేతిలోని గాజు బాటిల్తో ఎదుటి వ్యక్తిపై దాడి చేశాడు. తలకు తీవ్ర గాయం కావడంతో.. తోటి భక్తుడు ఆసుపత్రి పాలయ్యారు

# వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడంలో భాగస్వాములు కండి..

**గుక్కెడు చల్లటి నీరు అందించి దాహార్తిని తీర్చండి..**

**శిరీష్మ ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకం..**

**దాతల సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.**



విజయవాడ,మార్చి20(ఆర్ఎన్ఎ):వేసవిలో గుక్కెడు చల్లటి త్రాగు నీరుని అందించే పుణ్య కార్యక్రమం ప్రతి ఒక్కరూ భాగస్వాములై ప్రజల దాహార్తి తీర్చేందుకు ముందుకు రావాలని చలసాని శిరీష్మ కుటుంభ్యుల సేవలను స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలని దాతల సహకారంతో జిల్లా వ్యాప్తంగా చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు చల్లటి నీరు, మజ్జిగ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. చలసాని శిరీష్మ జ్ఞాపకార్థం కుటుంభ్యుల ఆధ్వర్యంలో స్థానిక రాఘవయ్య పార్కు సమీపంలో ఏర్పాటు చేసిన ఉచిత త్రాగునీరు ఆర్వో ప్లాంట్ మరియు వైద్య శిబిరాలను గురువారం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం ఉన్నయాని వాతావారణ శాఖ అధికారులు సూచిస్తున్నారన్నారు. ఈ నేపధ్యంలో ప్రజలు దాహార్తిని తీర్చడంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమన్నారు. రాజధానికి కేంద్ర బిందువైన విజయవాడ నగరానికి నిత్యం అనేక ప్రాంతాల నుండి వేలాదిమంది ప్రజలు విచ్చేస్తారన్నారు. వేసవి ప్రజలకు గుక్కెడు చల్లటి త్రాగునీరు అందించడం మంచి పుణ్య కార్యక్రమం అవుతుందన్నారు. త్రాగునీరు అందించేందుకు పెద్దగా ఖర్చు చేయాల్సిన అవసరం లేదని ప్రతి ఒక్కరూ వారి ఇల్లు లేదా వ్యాపార సంస్థ వద్ద మట్టి కుండలను, కూలింగ్ టిన్నులను ఏర్పాటు చేసుకుని దాహంతో ఉన్న వారికి చల్లటి నీరు మజ్జిగలను పంపిణీ చేయాలని ఇది ఎంతో పుణ్య కార్యక్రమం అని కలెక్టర్ తెలిపారు. వేసవి వేడిని దృష్టిలో పెట్టుకుని ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలు, ఆవాసా గ్రామలలో సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకాలు, రక్షిత నీటి సరఫరా పథకాలు, పంపింగ్ పథకాలు, చేతిపంపులు ఉన్నాయని వీటికి అవసరమైన మరమత్తులు చేసి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావడం ద్వారా ఇబ్బందులు అధిగమించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ ఆర్వో ప్లాంట్స్ ద్వారా ప్రజలకు త్రాగునీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. నీటి ఎద్దడి ఉన్న ఆవాసాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. ప్రజలకే కాదు పశుపక్ష్యాదులకూ కూడా తాగునీటికి ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. బస్టాండ్లు, ఆసుపత్రులు, రహదారుల కూడళ్లు తదితర ప్రదేశాల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నామని ఇందుకు అవసరమైతే దాతల సహకారం తీసుకోవాలని అధికారులకు సూచించామన్నారు. చలివేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే దాతలకు జిల్లా యంత్రాంగం పక్షాన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ప్రజలు ఎండ తీవ్రత కారణంగా వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో సిబ్బందికి అవగాహన కల్పించడంతో పాటు వడదెబ్బ బాధితులకు తక్షణ చికిత్స అందించేలా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఏపిఎన్జివో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. విద్యాసాగర్ మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు అనేక చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. చలివేంద్రాలు ఏర్పాటు చేయడానికి ముందుకు రావాలన్న జిల్లా కలెక్టర్ పిలుపు మేరకు నగరంలోని రద్దీ ప్రాంతాలలో ఏపిఎన్జివో అసోసియేషన్ పక్ష్యాన చలివేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న శిరీష్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని ప్రధాన వ్యాపార కూడలి ప్రాతంలో రక్షిత మంచి నీటి పథకాన్ని ఏర్పాటు చేసి చల్లటి త్రాగునీటి మజ్జిగను పంపిణీ చేయడం ఆదర్శప్రాయంగా నిలుస్తుందన్నారు. చలసాని శిరీష్మ తండ్రి వాటర్ ప్లాంట్ నిర్వహకులు చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలలో శిరీష్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరును అందించాలనే లక్ష్యంతో రక్షిత మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేసి 24 గంటలు చల్లటి త్రాగునీటిని అందజేస్తున్నామన్నారు. నిరుపేదలకు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి అవసరమైన మందులను సరఫరా చేయడం జరిగిందన్నారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు గోదావరి, కమ్మం, మహబూబ్నగర్ జిల్లాలోని గిరిజన ప్రాంతాలలో గిరిజనలకు అవసరమైన పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రారంభ కార్యక్రమంలో ప్రముఖ వైద్య నిపుణులు డా. రామ శేషయ్య, సామాజిక విశ్లేషకులు టి. లక్ష్మీనారాయణ, సామంతపూడి చైతన్య, ఎన్.నారాయణ, ఏపిఎన్జివో నాయకులు డి.సత్యనారాయణ రెడ్డి, పి. రమేష్, సివిఆర్ ప్రసాద్, నజీర్రుదీన్ తదితరులు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్ న్యూస్

## మళ్లీ మైదానంలోకి బంగ్లా మాజీ కెప్టెన్.. షకీబ్ అల్ హసన్‌కు క్లీన్‌చిట్..!




బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్ షకీబ్ హసన్ మళ్లీ మైదానంలో అడుగుపెట్టనున్నాడు. షకీబ్ బౌలింగ్ యాక్షన్ విషయంలో క్లీన్‌చిట్ లభించడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా వన్డే మ్యాచ్‌లు, లీగ్‌ల మ్యాచులు ఆడే అవకాశం దక్కింది. బంగ్లా ఆటగాడు టెస్టు, టీ20 ఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈ సందర్భంగా షకీబ్ అల్ హసన్ మాట్లాడుతూ తాను మళ్లీ బౌలింగ్ చేయగలనని పేర్కొన్నాడు. అయితే, రెండుసార్లు బౌలింగ్ యాక్షన్ రివ్యూలో పాల్గొనగా.. నిబంధనలకు విరుద్ధంగా గుర్తించారు. మూడోసారి రివ్యూకు వెళ్లగా యాక్షన్‌లో ఎలాంటి లోపం లేదని గుర్తించారు. అయితే, బౌలింగ్ యాక్షన్‌పై మూడోసారి ఎక్కడ రివ్యూకు వెళ్లాడో షకీబ్ వెల్లడించలేదు. చివరిసారిగా గతేడాది కాన్పూర్‌లో భారత్‌తో జరిగిన రెండో టెస్టు మ్యాచ్ ఆడాడు. 37 ఏళ్ల ఆల్‌రౌండర్ గతేడాది సెప్టెంబర్‌లో కౌంటీ చాంపియన్‌షిప్‌లో సర్రే జట్టు తరఫున మ్యాచ్ ఆడాడు. ఈ సమయంలో ఆన్ ఫీల్డ్ అంపైర్ బౌలింగ్ యాక్షన్ నిబంధనలకు విరుద్ధంగా ఉందని గుర్తించారు.అదే నెలలో లౌబరో విశ్వవిద్యాలయంలో నిర్వహించిన పరీక్షల్లో షకీబ్ బౌలింగ్ నిబంధనలకు విరుద్ధంగా ఉందని గుర్తించారు. జనవరిలో మళ్లీ చెన్నైలో పరీక్ష జరగ్గా.. విరుద్ధంగా ఉన్నట్లు గుర్తించలేదు. ఐసీసీ విధించిన బ్యాన్ కారణంగా ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యాడు. ప్రస్తుతం శ్రీలంకతో జరిగే వన్డే సిరీస్‌కు ఆడే అవకాశం ఉన్నది. ఐపీఎల్, పీఎస్‌ఎల్‌లో ఆడడం లేదు. గత సీజన్ వరకు ఐపీఎల్‌లో ఆడిన బంగ్లా మాజీ కెప్టెన్ వేలంలో కొనుగోలు చేసేందుకు ఫ్రాంచైజీలు ముందుకు రాలేదు. షకీబ్‌పై నిషేధం ఉన్నా.. బ్యాట్స్‌మెన్‌గా మాత్రం ఆడేందుకు అవకాశం ఉంది. షకీబ్ ప్రస్తుతం గతేడాది టీ20 ఇంటర్నేషనల్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన తర్వాత కెరీర్ గందరగోళంలో పడింది. షకీబ్ 71 టెస్టుల్లో 4609 పరుగులు చేసి.. 246 వికెట్లు పడగొట్టాడు. 247 వన్డేలు ఆడి.. 7,570 పరుగులు చేసి.. 317 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. 129 టీ20ల్లో 2551 పరుగులు, 149 వికెట్లు తీశాడు.

## ఐపీఎల్‌లో ఇక బౌలర్లకు పండగే.. సలైవాపై నిషేధం ఎత్తివేయనున్న బీసీసీఐ..!




ఇండియన్ ప్రీమియర్ లీగ్-2025 సీజన్ పాల్గొనే బౌలర్లకు బీసీసీఐ గుడ్‌న్యూస్ అందించబోతున్నది. సలైవా యూజ్‌పై ప్రస్తుతం ఉన్న బ్యాన్‌ను బీసీసీఐ ఎత్తివేయనున్నది. వాస్తవానికి గతంలో సలైవా (లాలాజలం) వాడడం గతం నుంచి అమలులో ఉన్నా.. కరోనా నేపథ్యంలో ఐసీసీ నిషేధించింది. ఆ తర్వాత ఐపీఎల్‌లోనూ నిషేధం విధించారు. లాలాజలాన్ని ఉపయోగించి.. బౌలర్లు బంతిని షైన్ అయ్యేలా చేసి రివర్స్ సింగ్‌కు ప్రయత్నిస్తుంటారు. ఇది చాలా ఎఫెక్టివ్ టెక్నిక్. బంతి పాతబడిన సందర్భంలో.. బౌలర్లు సలైవాను ఉపయోగించి బంతిని మెరిసేలా చేస్తూ రివర్స్ స్వింగ్‌కు చేపట్టే అవకాశం ఉండేది. ప్రస్తుతం కరోనా నిబంధనలు అమలు లేకపోవడం, ముప్పు కూడా ఏమీ లేకపోవడంతో బీసీసీఐ బ్యాన్‌పై నిషేధాన్ని ఎత్తివేయాలని భావిస్తున్నది. గురువారం జరిగే కెప్టెన్ల సమావేశంలో చర్చించనున్నట్లు తెలుస్తున్నది. బ్యాన్‌పై కెప్టెన్లు అందరూ ఏకాభిప్రాయానికి వస్తే సానుకూల నిర్ణయం వచ్చే అవకాశం ఉంది.గతంలో టీమిండియా ఫాస్ బౌలర్ మహ్మద్ షమీ సైతం సలైవా వాడేందుకు అనుమతి ఇవ్వాలని ఐసీసీని కోరాడు. బౌలర్లు సలైవా వినియోగించడం తప్పనిసరని.. లేకపోతే బ్యాట్స్‌మెన్‌కు పూర్తిగా అనుకూలంగా ఉంటుందని షమీ పేర్కొన్నారు. బౌలర్లు రివర్స్ స్వింగ్‌కు ప్రయత్నిస్తామని.. కానీ, సలైవా వాడడానికి అనుమతి లేదని.. బ్యాన్ ఎత్తివేయాలని కోరుతున్నామని.. రివర్స్ స్వింగ్ ఆటను ఆసక్తికరంగా మారుస్తుందని తెలిపాడు. దక్షిణాఫ్రికా బౌలర్ వెర్నన్ ఫిలాండర్, న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ టీమ్ సౌతి సహా పలువురు ప్లేయర్లు సలైవా వాడుకునే వెసులుబాటు కల్పించాలని కోరారు. దీనిపై ఇప్పటి వరకు ఐసీసీ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోయినా.. ఐపీఎల్‌లో బ్యాన్ ఎత్తివేస్తే మాత్రం బౌలర్లకు ఎంతో ఊరట కలుగనున్నది. ఇదే జరిగితే బ్యాట్‌కు, బంతికి మధ్య జరిగే పోరాటం ఆసక్తికరంగా మారనున్నది.ఇప్పటి వరకు డీఆర్ఎస్ కేవలం అవుట్, నాటౌట్, నోబాల్, వైడ్‌బాల్ వరకు మాత్రమే ఐపీఎల్‌లో వినియోగిస్తున్నారు. తాజాగా ఈ సీజన్ నుంచి హైట్ వైడ్‌బాల్‌కు సైతం డీఆర్ఎస్‌ను వాడనున్నట్లు సమాచారం. బ్యాటర్‌పై నుంచి బంతి ఎక్కువ ఎత్తు నుంచి వెళ్లిన సందర్భంలో వైడ్ బాల్ అవునో.. కాదో తెలుసుకునేందుకు డీఆర్ఎస్‌ను వాడుకునేందుకు ప్లేయర్స్‌కు అనుమతి లభించనున్నది. దాంతో ఆట మరింత ఆసక్తికరంగా మారనున్నది. తాజాగా ఈ నిబంధనపై సైతం కెప్టెన్ల సమావేశంలో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది.ఐపీఎల్ 18వ ఎడిషన్ ఈ నెల 22 నుంచి ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్ డిఫెండింగ్ ఛాంపియన్స్ కోల్‌కతా నైట్ రైడర్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య జరుగనున్నది. ఈ సంవత్సరం 65 రోజుల్లో 13 వేదికల్లో 10 జట్లు పోటీపడనున్నాయి. టోర్నీలో మొత్తం 74 మ్యాచులు జరుగుతాయి. ఇందులో 70 లీగ్ మ్యాచులు, నాలుగు ప్లే ఆఫ్ మ్యాచులు ఉంటాయి. ఫైనల్‌తో సహా ప్లేఆఫ్ మ్యాచులన్నీ మే 20 నుంచి 25 వరకు హైదరాబాద్, కోల్‌కతాలో జరుగుతాయి. క్వాలిఫయర్-1, ఎలిమినేటర్‌కు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనుంది. క్వాలిఫయర్-2, ఫైనల్‌కు కోల్‌కతా ఆతిథ్యం ఇస్తుంది. ఐపీఎల్-2025లో మొత్తం 12 డబుల్ హెడర్‌లు ఉంటాయి. తొలి మ్యాచ్ మధ్యాహ్నం 3.30 గంటలకు.. రెండో మ్యాచ్ రాత్రి 7.30 గంటలకు మొదలవుతుంది.

## బుమ్రా ఫిట్‌నెస్‌పై లేటెస్ట్ అప్‌డేట్! రీ-ఎంట్రీ పై క్లారిటీ ఇచ్చిన ఓఎ హెడ్ కోచ్

జస్‌ప్రీత్ బుమ్రా గాయం కారణంగా 2025లో తొలి మ్యాచ్‌కి అందుబాటులో ఉండే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. ముంబై ఇండియన్స్ కోచ్ మహేల జయవర్ధనే ప్రకారం, బుమ్రా ఇంకా ఔఅంలోనే ఉండి కోలుకుంటున్నాడు. ముంబై ఇండియన్స్ బౌలింగ్ విభాగానికి అతని గైర్హాజరీ పెద్ద ఎదురుదెబ్బ అవుతుందని భావిస్తున్నారు. ఏప్రిల్ ప్రారంభంలో అతను తిరిగి వచ్చే అవకాశం ఉండటంతో, ఓఎ అభిమానులు కొంత ఊరట చెందుతున్నారు.ఎఖఒ 2025: బుమ్రా ఫిట్‌నెస్‌పై లేటెస్ట్ అప్‌డేట్! రీ-ఎంట్రీ పై క్లారిటీ ఇచ్చిన ఓఎ హెడ్ కోచ్ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఎఖఒ) 2025 ప్రారంభానికి ముందు, ముంబై ఇండియన్స్ (ఓఎ) వారి ప్రీ-సీజన్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించింది. ఈ సమావేశంలో జస్‌ప్రీత్ బుమ్రా గాయం, అతని ఫిట్‌నెస్ పరిస్థితి గురించి కీలక అప్‌డేట్ ఇచ్చారు. ముంబై ఇండియన్స్ తమ సీజన్‌ను మార్చి 23న చెన్నై సూపర్ కింగ్స్ (ఊఙఐ)తో ప్రారంభించనుంది, అయితే బుమ్రా తొలి మ్యాచ్‌కు అందుబాటులో ఉండే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. 2024-25 బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సమయంలో బుమ్రా వెన్నునొప్పి సమస్యతో బాధపడుతూ బౌలింగ్‌లో పూర్తి స్థాయిలో రాణించలేకపోయాడు. ఈ గాయం కారణంగా, అతను 2025 ఛాంపియన్స్ ట్రోఫీ కోసం తాత్కాలిక భారత జట్టులో ఎంపికైనప్పటికీ, పూర్తి స్థాయిలో ఫిట్‌గా లేకపోవడంతో తాను ఆ టోర్నమెంట్ నుంచి వైదొలగాల్సి వచ్చింది.గత వారం వెలువడిన నివేదికల ప్రకారం, బుమ్రా ఎఖఒ 2025 ప్రారంభ మ్యాచ్‌లు మిస్సయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. తాజాగా, మార్చి 19న ముంబై ఇండియన్స్ ప్రధాన కోచ్ మహేల జయవర్ధనే దీనిపై క్లారిటీ ఇచ్చారు. “బుమ్రా ఇంకా జాతీయ క్రికెట్ అకాడమీ (ఔఅం)లోనే ఉన్నాడు. అతను కోలుకుంటున్నాడు, రోజువారీగా అతనిపై పర్యవేక్షణ కొనసాగుతోంది. మంచి ఉత్సాహంతో ఉన్నాడు, త్వరగా మళ్లీ జట్టులో చేరుతాడని ఆశిస్తున్నాను,” అని జయవర్ధనే వెల్లడించారు.బుమ్రా తిరిగి ముంబై ఇండియన్స్ జట్టులో చేరే ఖచ్చితమైన టైమ్‌లైన్ ఇంకా తెలియనప్పటికీ, ఏప్రిల్ ప్రారంభంలో అతను తిరిగి వచ్చే అవకాశం ఉందని నివేదికలు సూచిస్తున్నాయి.ముంబై ఇండియన్స్ ప్రధాన పేసర్ అయిన బుమ్రా లేనట్లయితే, జట్టు బౌలింగ్ విభాగం కొంత ఇబ్బందికర స్థితిని ఎదుర్కోవచ్చు. గత సీజన్లలో ఓఎ బౌలింగ్ దళానికి బుమ్రా కీలక బలంగా ఉన్నాడు. ముఖ్యంగా డెత్ ఓవర్లలో అతని స్పెల్స్ ప్రత్యర్థి జట్లను కట్టడి చేయడంలో సహాయపడతాయి.ఐపీఎల్ 2025 సీజన్ ముంబై ఇండియన్స్-చెన్నై సూపర్ కింగ్స్ మధ్య హై-వోల్టేజ్ మ్యాచ్‌తో ప్రారంభం కానుంది. రుతురాజ్ గైక్వాడ్ నాయకత్వంలోని ఊఙఐ, తమ హోం గ్రౌండ్ అయిన ఓం చిదంబరం స్టేడియంలో ఆడనుంది. ముంబై ఇండియన్స్ తమ స్టార్ బౌలర్ బుమ్రా లేకపోవడంతో కొత్త వ్యూహాలతో బరిలోకి దిగాల్సి ఉంటుంది.మొత్తానికి, బుమ్రా ఫిట్‌నెస్ సమస్య ముంబై ఇండియన్స్‌కు తలనొప్పిగా మారినా, ఏప్రిల్ మొదట్లో అతను తిరిగి వచ్చే అవకాశం ఉండటంతో అభిమానులు కొంత ఊరట చెందుతున్నారు.




## చాహల్ - ధనశ్రీకి విడాకులు మంజూరు

వీరిద్దరూ విడాకులు తీసుకోబోతున్నారంటూ గత కొంతకాలంగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. 2022 నుంచే ఈ ఇద్దరూ వేర్వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలో 2025 ఫిబ్రవరి 5న ముంబైలోని ఫ్యామిలీ కోర్టులో విడాకుల కోసం ఇద్దరూ దరఖాస్తు చేసుకున్నారు. ఇక పరస్పర అంగీకారంతో ఈ జంట విడాకులు తీసుకోవాలని కోరుకుంటున్న నేపథ్యంలో ఆరు నెలల కూలింగ్ పీరియడ్‌ను మినహాయించాలని ఫ్యామిలీ కోర్టును అభ్యర్థించగా అందుకు న్యాయస్థానం ఒప్పుకోలేదు. దీనిని సవాల్ చేస్తూ చాహల్ తరఫు న్యాయవాది హైకోర్టును ఆశ్రయించగా అందుకు న్యాయస్థానం పిటీషన్‌దారుకు అనుకూలంగా తీర్పునిచ్చింది. 2022 నుంచే విడివిడిగా ఉంటున్నందున మళ్లీ ఆరు నెలల కూలింగ్ పీరియడ్ అవసరం లేదని స్పష్టం చేసింది.అంతేకాదు మార్చి 20 లోపు విడాకుల అంశంపై తుది తీర్పు ఇవ్వాలని ఫ్యామిలీ కోర్టును ఆదేశించింది. ఈ నేపథ్యంలో చాహల్ ? ధనశ్రీ జంటకు విడాకులు మంజూరు చేస్తూ ఫ్యామిలీ కోర్టు గురువారం తుది తీర్పు వెలువరించింది. ధనశ్రీకి



భరణం కింద రూ. 4.75 కోట్లు ఇచ్చేందుకు చాహల్ ఇప్పటికే అంగీకరించారు. ఈ మొత్తంలో ఇందులో రూ. 2.37 కోట్లు చెల్లించాడు కూడా.కాగా, దంత వైద్యురాలైన ధనశ్రీ వర్మను 2020 డిసెంబర్ 22న చాహల్ పెండ్లి చేసుకున్నారు. కొరియోగ్రాఫర్‌గా, సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా తనకంటూ గుర్తింపు తెచ్చుకుంది ధనశ్రీ. పెళ్లి తర్వాత వీళ్లిద్దరూ ఇన్‌స్టాలో రీల్స్ చేస్తూ ఫ్యాన్స్‌ను అలరిస్తూనే ఉన్నారు. అయితే, ఇటీవలే ధనశ్రీ తన పేరు నుంచి 'చాహల్' నేమ్‌ను తీసేయడంతో పాటు ఫొటోలను కూడా సోషల్ మీడియా నుంచి తొలగించింది. దీంతో ఈ జంట విడాకులు తీసుకోబోతోందంటూ పుకార్లు వ్యాపించాయి. ఆ తర్వాత చాహల్ సైతం 'న్యూ లైఫ్ లోడెడ్' అంటూ ఇన్‌స్టా స్టోరీస్‌లో రాసుకొచ్చాడు. దీంతో వీరు విడాకులు తీసుకోవడం ఖాయం అని ప్రచారం జరిగింది. ఈ క్రమంలోనే వీరు తమ సోషల్ మీడియా ఖాతాలో ఒకరినొకరు అన్‌ఫాలో చేసుకోవడం, ఇద్దరూ తమ సోషల్‌మీడియా అకౌంట్లలో తమదైన శైలిలో పోస్టులు పెట్టడంతో ఆ వార్తలకు మరింత ఆజ్యంపోసినట్లైంది.

## ఆర్ఆర్ కెప్టెన్‌గా రియాన్ పరాగ్.. ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్‌గా సంజూ శాంసన్

న్యూఢిల్లీ: రాజస్థాన్ రాయల్స్ జట్టుకు రైజింగ్ స్టార్ రియాన్ పరాగ్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టనున్నాడు. ఐపీఎల్‌లో తొలి మూడు మ్యాచ్‌లకు అతనే సారథిగా కొనసాగుతాడు. రెగ్యులర్ కెప్టెన్ సంజూ శాంసన్.. ఆ మ్యాచుల్లో స్పెషలిస్టు బ్యాటర్ కమ్ ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్‌గా ఆడనున్నాడు. ఇటీవల శాంసన్ చేతి వేలికి శస్త్ర చికిత్స జరిగింది. అయితే అతను పూర్తి స్థాయి కీపర్‌గా బరిలోకి దిగేందుకు ఇంకా క్లియరెన్స్ దక్కలేదు. దీంతో శాంసన్‌ను ఇంపాక్ట్ ప్లేయర్‌గా వాడుకోవాలని రాజస్థాన్ రాయల్స్ ప్లాన్ వేసింది.ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్ సమయంలో.. జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో శాంసన్ వేలికి గాయమైన విషయం తెలిసిందే. బ్యాటింగ్ చేసేందుకు శాంసన్‌కు క్లియరెన్స్ ఇచ్చింది. కానీ వికెట్ కీపింగ్ చేసేందుకు బీసీసీఐ ఎక్సలెన్స్ సెంటర్ నుంచి ఇంకా అనుమతి రాలేదు. శాంసన్ వేళ్లకు మరింత రెస్టు కావాలని ఎక్సలెన్స్ సెంటర్ అభిప్రాయపడింది. దీంతో 23 ఏళ్ల రియాన్ పరాగ్‌కు .. రాజస్థాన్ రాయల్స్ సారథ్య బాధ్యతలను అప్పగించారు. కోహ్లీ తర్వాత ఐపీఎల్‌లో అతి పిన్న వయసులో కెప్టెన్సీ చేపట్టనున్నట్లు ప్లేయర్‌గా




రియాన్ పరాగ్ నిలవనున్నాడు.రాజస్థాన్ రాయల్స్ తన తొలి మ్యాచ్‌లో మార్చి 23వ తేదీన సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనున్నది. ఆ తర్వాత మార్చి 26వ తేదీన కోల్‌కతాతో, 30వ తేదీన చెన్నైతో ఆడనున్నది. వికెట్ కీపింగ్, ఫీల్డింగ్ కోసం క్లియరెన్స్ దక్కే వరకు.. శాంసన్ స్పెషలిస్టు బ్యాటర్‌గా ఆడుతాడని ఆర్ఆర్ ఓ ప్రకటనలో తెలిపింది. పూర్తిగా ఫిట్ అయిన తర్వాత మళ్లీ సారథిగా శాంసన్ బరిలోకి దిగుతాడు.

## బంగాళాదుంపలు తెగ తింటున్నారా?
## ఆలూ అతిగా తింటే డేంజర్!



చాలామంది బంగాళాదుంపలను ఇష్టంగా తింటారు. బంగాళాదుంపలలో పోషకాలు ఉంటాయని అవి తింటే ఆరోగ్యంగా ఉంటామని భావిస్తారు. అయితే బంగాళదుంప తినడం వల్ల అనేక చెడు ప్రభావాలు కలుగుతాయని చెబుతున్నారు. బంగాళదుంపల్లో ఉండే పోషకాలు అధికంగా తీసుకుంటే మన ఆరోగ్యం పైన తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయని అంటున్నారు. బంగాళాదుంపల్లో ఫుల్ పోషకాలు బంగాళదుంపలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఫైబర్, మెగ్నీషియం, పొటాషియం, విటమిన్ ఎ6 వంటి ఇతర ముఖ్యమైన పోషకాలు కూడా ఉంటాయి. ఇక వీటిని అధికంగా తీసుకోవడం చాలా హానికరం. ప్రతిరోజు బంగాళదుంప తినేవారు అనేక దుష్ప్రభావాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. బంగాళదుంపలు ఎక్కువగా తింటే ఒళ్ళు నొప్పులు, కాళ్ళు నొప్పులు వేధిస్తాయి. డయాబెటిస్ ఉన్నవారు బంగాళాదుంపలు తినకుండా ఉంటేనే మంచిది బంగాళదుంపల్లో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండటం వల్ల అవి రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడానికి దోహదం చేస్తాయి. ఇది డయాబెటిస్ ఉన్నవారికి ఇబ్బంది కలిగిస్తుంది. బ్లడ్ షుగర్ ను పెంచుతుంది. అందుకే డయాబెటిస్ ఉన్నవారు బంగాళదుంపలను తినకుండా ఉంటేనే మంచిది. ఇక బంగాళాదుంపలను తినడం వల్ల బరువు పెరిగే ప్రమాదం ఉంది. బంగాళదుంపలలో క్యాలరీలు ఎక్కువగా ఉంటాయి. వీటిని తరచుగా తినడం వల్ల బరువు పెరుగుతారు. బంగాళాదుంపలతో జీర్ణ సమస్యలు ముఖ్యంగా వేయించిన, చీజ్ ఇతర పదార్థాలతో కలిపి తిన్న బరువు పెరిగే ప్రమాదం ఉంటుంది. కనుక వీటికి దూరంగా ఉంటేనే మంచిది . బంగాళదుంపలను ఎక్కువగా తినడం వల్ల జీర్ణ సమస్యలు వస్తాయి. కడుపు ఉబ్బరం, గ్యాస్ ఏర్పడి తీవ్రంగా ఇబ్బంది పడతారు. బంగాళదుంపలను అధికంగా తీసుకోవడం వల్ల పోషకాల అసమతుల్యత ఏర్పడుతుంది. బంగాళాదుంపలతో రక్తపోటు ప్రమాదం బంగాళదుంపలలో కొన్ని విటమిన్లు, ఖనిజాలు ఎక్కువగా ఉన్నప్పటికీ వీటిలో మన శరీరానికి కావలసిన ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు లేవు కనుక ఎక్కువగా తింటే అనారోగ్యమే . ఇక ముఖ్యంగా బంగాళదుంపలను వేయించి తినడం, చిప్స్ తినడం ఏ మాత్రం మంచిది కాదు. ఇవి అధిక రక్తపోటుకు కారణం అవుతాయి. ముఖ్యంగా వేయించిన బంగాళదుంపలను తినడం చాలా ప్రమాదాలకు కారణం అవుతుంది.వీరు బంగాళాదుంపలకు దూరం ఉంటేనే బెస్ట్ కాబట్టి బంగాళదుంపలను ఎక్కువగా తినేవారు కాస్త తగ్గించుకుంటే మంచిది. డయాబెటిస్, బిపి వంటి అనారోగ్య సమస్యలు ఉన్నవారు వాటిని పూర్తిగా తినకుండా ఉంటేనే మంచిది. కీళ్ళ నొప్పులు వంటి సమస్యలు ఉన్నవారు కూడా బంగాళాదుంపలకు దూరంగా ఉండాలి.

## బొప్పాయితో ఈ సీడ్స్ కలిపి తీసుకుంటే
## మీ శక్తి రెట్టింపు.. రెచ్చిపోతారు ఇక!



ఆరోగ్యంపై శ్రద్ధ చూపే ప్రతి ఒక్కరికీ ప్రకృతి ఎన్నో అద్భుతమైన వరాలను అందిస్తోంది. అలాంటి వాటిలో బొప్పాయి , చియా విత్తనాలు ముఖ్యమైనవి. ఇవి రెండూ విడివిడిగా ఎన్నో పోషక విలువలను కలిగి ఉంటాయి. మరి ఈ రెండింటినీ కలిపి తీసుకుంటే మీ శరీరంలో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయో తెలుసా? ఇది నిజంగా ఒక అద్భుతమైన ఆరోగ్య కలయిక అని చెప్పవచ్చు! జీర్ణక్రియకు ఊతం: బొప్పాయిలో ఉండే పపైన్ అనే ఎంజైమ్ ఆహారాన్ని సులభంగా జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. ఇక చియా విత్తనాల్లో ఉండే ఫైబర్ జీర్ణవ్యవస్థను శుభ్రంగా ఉంచడమే కాకుండా మలబద్ధకం సమస్యను నివారిస్తుంది. ఈ రెండూ కలిసి మీ జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి, ఆహారం నుండి పోషకాలు బాగా గ్రహించబడేలా చేస్తాయి. కడుపు ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలు తగ్గిపోతాయి. శక్తిని పెంచే సహజ వనరు: ఉదయం బొప్పాయి , చియా విత్తనాలను కలిపి తీసుకుంటే రోజంతా మీకు కావాల్సిన శక్తి లభిస్తుంది. బొప్పాయిలో ఉండే సహజ చక్కెరలు తక్షణ శక్తినిస్తాయి. చియా విత్తనాల్లో ఉండే ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఆ శక్తిని ఎక్కువసేపు నిలబెడతాయి. దీంతో మీరు నీరసంగా అనిపించకుండా ఉత్సాహంగా ఉంటారు. బరువు తగ్గడానికి సహాయం: బరువు తగ్గాలనుకునే వారికి ఈ కలయిక ఒక గొప్ప వరం. చియా విత్తనాలు నీటిని పీల్చుకొని కడుపులో ఉబ్బినట్లుగా అనిపిస్తాయి. దీనివల్ల ఎక్కువసేపు ఆకలి వేయదు, మీరు తక్కువ ఆహారం తీసుకుంటారు. బొప్పాయిలో ఉండే తక్కువ కేలరీలు , ఫైబర్ బరువు నియంత్రణకు తోడ్పడతాయి. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది: చియా విత్తనాల్లో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడానికి సహాయపడతాయి. బొప్పాయిలో ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఈ రెండూ కలిసి మీ గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. చర్మ సౌందర్యానికి మెరుగు: బొప్పాయిలో విటమిన్ సి , యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుండి రక్షించి యవ్వనంగా ఉంచడానికి సహాయపడతాయి. చియా విత్తనాల్లో ఉండే యాంటీఆక్సిడెంట్లు మరియు ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు చర్మానికి తేమను అందించి కాంతివంతంగా చేస్తాయి. ఎముకలను దృఢంగా చేస్తుంది: చియా విత్తనాల్లో కాల్షియం, ఫాస్పరస్ , మెగ్నీషియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎముకలను దృఢంగా చేయడానికి, ఎముకల సాంద్రతను పెంచడానికి సహాయపడతాయి. బొప్పాయిలో ఉండే విటమిన్ కె కూడా ఎముకల ఆరోగ్యానికి తోడ్పడుతుంది రోజూ తింటే మీ శక్తి రెట్టింపు! ఈ అద్భుతమైన ప్రయోజనాలను పొందడానికి బొప్పాయి ముక్కలను, నానబెట్టిన చియా విత్తనాలను కలిపి నేరుగా తీసుకోవచ్చు లేదా స్మూతీస్, సలాడ్లలో కలుపుకొని తినవచ్చు. కాబట్టి, మీ ఆరోగ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవడానికి బొప్పాయి, చియా విత్తనాలను మీ ఆహారంలో భాగంగా చేసుకోండి. ఇది మీ శరీరానికి అందించే ఒక అద్భుతమైన బహుమతి. అయితే, ఏదైనా కొత్త ఆహారాన్ని ప్రారంభించే ముందు మీ వైద్యుడిని సంప్రదించడం మంచిది.

## వేసవిలో చర్మ సౌందర్యం కోసం చెయ్యాల్సిందిదే!!

వేసవికాలం రానే వచ్చింది. వేసవికాలం చెమట, చిరాకుతో చాలామంది ఇబ్బంది పడుతూ ఉంటారు. ఎండలో బయటకు వెళ్లి వచ్చినవారు చర్మ సమస్యలతో బాధపడుతూ ఉంటారు. అయితే వేసవికాలంలో ఎటువంటి చర్మ సమస్యలు వస్తాయి? చర్మ సంరక్షణ కోసం ఏం చేయాలి? వంటి అనేక వివరాలను ప్రస్తుతం మనం తెలుసుకుందాం. చర్మ సంరక్షణ కోసం ఇలా చెయ్యండి వేసవికాలంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు చర్మాన్ని కాపాడుకోవాలి అని భావించేవారు సూర్యుని ఎండకు నేరుగా గురికాకుండా ఉండాలి. బయటకు వెళ్ళినప్పుడు సన్ స్క్రీన్ లోషన్స్ ఉపయోగించాలి. క్యాప్, గొడుగు, సన్ గ్లాసెస్ వంటివి ధరించాలి. అంతేకాదు ఎండాకాలం చర్మ సంరక్షణ కోసం తరచూ నీటిని తాగాలి. శరీరం డిహైడ్రేట్ కాకుండా కాపాడుకోవాలి. వేసవికాలం చర్మాన్ని కాపాడుకోవాలంటే ఇవి తప్పనిసరి శరీరాన్ని హైడ్రేటెడ్ గా ఉంచుకుంటే చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. చర్మ



ఆరోగ్యానికి తేలికపాటి మాయిశ్చరైజర్స్ ఉపయోగించాలి. చల్లని నీళ్లతో స్నానం చేయాలి. ఎండాకాలం రోజుకు రెండు సార్లు ముఖం కడుక్కోవాలి. చెమట ఎక్కువగా పడుతున్న వారు రోజుకు రెండుసార్లు స్నానం చేయాలి. వదులుగాను ఫ్రీగానూ ఉండే కాటన్ దుస్తులను ధరించాలి. ఇక ఎండాకాలంలో జిడ్డు,కారం ఉండే ఆహారాలకు దూరంగా ఉండాలి. ఈ ఆహారాలతో చర్మ సంరక్షణ విటమిన్ సి అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవాలి. తాజా పండ్లను, కూరగాయలను ఎక్కువగా తీసుకోవాలి. ఇక రసాయనాలు ఎక్కువగా ఉండే సౌందర్య సాధనాలను ఉపయోగించకూడదు. చర్మానికి సరిపడే ఉత్పత్తులను మాత్రమే చర్మ సంరక్షణ కోసం వాడాలి. ఇక ఎండాకాలంలో ముఖం మీద వచ్చే మొటిమలను గిల్లటం, నొక్కటం వంటివి చేయకూడదు. అవి సెప్టిక్ అయ్యే ప్రమాదం ఉంటుంది.

## రక్తపోటును నియంత్రించే సూపర్ ఫుడ్
## ఇదొక్కటే.. రోజూ తింటే మీ శక్తి రెట్టింపు!

సగ్గుబియ్యం.. చాలామందికి ఇష్టమైన ఆహారం. వీటిని పాయసం, కిచిడీ, వడలు వంటి వివిధ రకాల వంటకాల్లో ఉపయోగిస్తారు. సగ్గుబియ్యం చూడటానికి తెల్లగా గుండ్రంగా ఉంటాయి. ఇవి మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిలో పిండి పదార్థాలు, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. సగ్గుబియ్యం తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.. శక్తిని పెంచుతుంది: సగ్గుబియ్యంలో పిండి పదార్థాలు అధికంగా ఉంటాయి. ఇవి శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. శారీరక శ్రమ చేసేవారికి, క్రీడాకారులకు ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. నీరసంగా అనిపించినప్పుడు సగ్గుబియ్యంతో చేసిన ఆహారం తీసుకోవడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. దీనిలో ఫైబర్ కూడా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. మలబద్ధకం సమస్యతో బాధపడేవారికి ఇది ఒక మంచి ఆహారం. సగ్గుబియ్యం తేలికగా జీర్ణమవుతుంది. కాబట్టి కడుపు నొప్పి, అజీర్తి వంటి సమస్యలు ఉండవు. ం ఎముకలను బలంగా చేస్తుంది: సగ్గుబియ్యంలో కాల్షియం, ఐరన్ మరియు విటమిన్ కె వంటి ఖనిజాలు ఉంటాయి. ఇవి ఎముకలను బలంగా చేయడానికి సహాయపడతాయి.



పిల్లలకు, వృద్ధులకు ఇది చాలా మంచి ఆహారం. ఎముకల సాంద్రతను పెంచడానికి సగ్గుబియ్యం ఉపయోగపడుతుంది. దీనిలో కేలరీలు అధికంగా ఉంటాయి. బరువు పెరగాలనుకునే వారికి ఇది ఒక మంచి ఎంపిక. బలహీనంగా ఉన్నవారు సగ్గుబియ్యంతో చేసిన ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యకరమైన బరువును పొందవచ్చు. రక్తపోటును నియంత్రిస్తుంది: సగ్గుబియ్యంలో పొటాషియం ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. అధిక రక్తపోటు సమస్యతో బాధపడేవారికి ఇది ఒక ఆరోగ్యకరమైన ఆహారం. ఇది రక్తనాళాలను వెడల్పు చేసి రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. సగ్గుబియ్యంలో ఫోలిక్ యాసిడ్ ఉంటుంది. ఇది గర్భిణీ స్త్రీలకు చాలా అవసరం. ఇది పుట్టబోయే బిడ్డలో జన్యుపరమైన లోపాలను నివారిస్తుంది. గర్భిణీ స్త్రీలు సగ్గుబియ్యంతో చేసిన ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారు.

## ఈ అలవాట్లను మార్చుకోకపోతే..
## డాక్టర్లు కూడా మిమ్మల్ని రక్షించలేరు!

బరువు పెరగడం అనేది చాలా మందిని వేధించే సమస్య. కొందరికి ఇది ఆరోగ్య సమస్యల కారణంగా సంభవించినప్పటికీ, ఎక్కువ మందికి వారి రోజువారీ అలవాట్లే ప్రధాన కారణం. మనం చేసే చిన్న చిన్న పొరపాట్లు, నిర్లక్ష్యంగా తీసుకునే ఆహారం, జీవనశైలిలో మార్పులు క్రమంగా మన బరువును పెంచుకుంటూ పోతాయి. ఈ బరువు పెంచే అలవాట్లను గుర్తిస్తే, మనం ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చు. జంక్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్: మొదటగా ఆహారం విషయానికి వస్తే, చాలా మంది సమయం లేకపోవడం లేదా ఇతర కారణాల వల్ల సరైన ఆహారం తీసుకోరు. దీనికి బదులుగా జంక్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్ లేదా అధిక కేలరీలు ఉండే ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకుంటారు. పిజ్జాలు, బర్గర్లు, ఫ్రెంచ్ ఫ్రైస్ వంటి ఆహారాల్లో కేలరీలు, కొవ్వులు , చక్కెరలు అధికంగా ఉంటాయి. వీటిని తరచుగా తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు అందకపోయినా, అధిక మొత్తంలో కేలరీలు మాత్రం చేరుతాయి. ఇది క్రమంగా బరువు పెరగడానికి దారితీస్తుంది.భోజనం చేసే వేళల్లో మార్పులు: తరువాత, చాలా మందికి భోజనం చేసే వేళలు కూడా సరిగా ఉండవు. ఒకరోజు ఉదయం 8 గంటలకు తింటే, మరోరోజు 11 గంటలకు తినడం వల్ల జీర్ణక్రియ వ్యవస్థ గందరగోళానికి గురవుతుంది. అంతేకాకుండా, చాలా మంది రాత్రిపూట ఆలస్యంగా భోజనం చేస్తారు. రాత్రిపూట జీర్ణక్రియ నెమ్మదిగా జరుగుతుంది కాబట్టి, ఆహారం సరిగ్గా జీర్ణం కాక కొవ్వుగా మారే అవకాశం ఉంది. నిద్రపోయే ముందు భారీగా తినడం కూడా బరువు పెరగడానికి ఒక ముఖ్య కారణం. శీతల పానీయాలు: ఇక పానీయాల విషయానికి వస్తే, చాలా మంది శీతల పానీయాలు, చక్కెర కలిపిన జ్యూస్‌లు , ఇతర తీపి పానీయాలను ఎక్కువగా తాగుతారు. వీటిలో కేలరీలు చాలా ఎక్కువగా ఉంటాయి, కానీ పోషక విలువలు మాత్రం శూన్యం. వీటిని తాగడం వల్ల కడుపు నిండిన భావన కలగదు, కానీ శరీరానికి మాత్రం అధిక మొత్తంలో చక్కెర చేరుతుంది. ఇది ఇన్సులిన్ నిరోధకతకు దారితీసి, బరువు పెరగడానికి కారణమవుతుంది. నీరు తక్కువగా తాగడం కూడా బరువు పెంచే అలవాట్లలో ఒకటి. నీరు జీవక్రియను మెరుగుపరచడానికి మరియు ఆకలిని నియంత్రించడానికి సహాయపడుతుంది. కాబట్టి, తగినంత నీరు తాగకపోతే శరీరం డీహైడ్రేషన్‌కు గురవ్వడమే కాకుండా, బరువు కూడా పెరిగే అవకాశం ఉంది. చాలా మంది శారీరక శ్రమ లేని జీవితాన్ని గడుపుతున్నారు. రోజంతా కూర్చొని పనిచేయడం, వ్యాయామం చేయకపోవడం వల్ల శరీరంలో కేలరీలు ఖర్చు కావు , కొవ్వు పేరుకుపోతుంది. టీవీ చూడటం లేదా మొబైల్‌తో గడపడం వంటి నిశ్చలమైన కార్యకలాపాలకు ఎక్కువ సమయం కేటాయించడం కూడా బరువు పెంచే అలవాటే. కనీసం రోజుకు 30 నిమిషాలైనా వ్యాయామం చేయడం లేదా నడవడం ఆరోగ్యానికి చాలా ముఖ్యం రోజూ తింటే మీ శక్తి రెట్టింపు! “ నిద్రలేమి హార్మోన్ల సమతుల్యత: నిద్ర సరిగా పోకపోవడం కూడా బరువు పెరగడానికి ఒక కారణం. నిద్రలేమి హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీస్తుంది, దీనివల్ల ఆకలి నియంత్రణ తప్పుతుంది మరియు ఎక్కువ తినాలనిపిస్తుంది. తగినంత నిద్ర లేకపోవడం వల్ల ఒత్తిడి కూడా పెరుగుతుంది, ఇది కూడా బరువు పెరగడానికి దారితీస్తుంది. కాబట్టి, రోజుకు కనీసం 7-8 గంటలు నిద్రపోవడం చాలా అవసరం. అధిక ఒత్తిడి: ఒత్తిడి కూడా బరువు పెంచే ఒక ముఖ్యమైన అంశం. చాలా మంది ఒత్తిడిని తగ్గించుకోవడానికి ఎక్కువగా తింటారు, ముఖ్యంగా తీపి మరియు కొవ్వు పదార్థాలను. దీన్నే “ఎమోషనల్ ఈటింగ్” అంటారు. ఒత్తిడి సమయంలో విడుదలయ్యే కార్టిసాల్ హార్మోన్ కూడా బరువు పెరగడానికి సహాయపడుతుంది. కాబట్టి, ఒత్తిడిని నిర్వహించడం మరియు ఆరోగ్యకరమైన మార్గాల్లో దానిని తగ్గించుకోవడం చాలా ముఖ్యం. ఈ బరువు పెంచే అలవాట్లను గుర్తించి, వాటిని క్రమంగా మార్చుకోవడం ద్వారా మనం ఆరోగ్యకరమైన బరువును కాపాడుకోవచ్చు మరియు అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, సరైన వేళలకు భోజనం చేయడం, తగినంత నీరు తాగడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, తగినంత నిద్రపోవడం ఆరోగ్యకరమైన జీవితానికి పునాదులు. ఈ మంచి అలవాట్లను అలవర్చుకోవడం ద్వారా మీరు మీ బరువును నియంత్రించడమే కాకుండా, మరింత ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉంటారు.






# సినిమా



# సూపర్ స్టార్ స్ఫూర్తితోనే ఆ సీన్ ను తీశా



మోహన్ లాల్ హీరోగా పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో వచ్చిన లూసీఫర్ మూవీ ఎంత పెద్ద హిట్ అయిందో తెలిసిందే. ఈ సినిమాతో డైరెక్టర్ గా పృథ్వీరాజ్ తన సత్తా ఏంటో చూపించాడు. మోహన్ లాల్ కు కూడా లూసీఫర్ మంచి పేరు తెచ్చిపెట్టింది. కేవలం హిట్ టాక్ మాత్రమే కాకుండా ఆ సినిమా కమర్షియల్ గా కూడా బాగా పే చేసింది. తెలుగులో అదే సినిమాను మెగాస్టార్ చిరంజీవి హీరోగా నయనతార కీలకపాత్రలో రీమేక్ చేశారు. గాడ్ ఫాదర్ అనే టైటిల్ తో రీమేక్ అయిన ఈ మూవీ తెలుగులో కూడా బాగానే ఆడింది. అయితే ఇప్పుడు లూసీఫర్ కు సీక్వెల్ తెరకెక్కింది. ఎల్2: ఎంపురాన్ టైటిల్ తో రూపొందిన ఈ సినిమా మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా రిలీజ్ దగ్గర పడుతున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ ప్రమోషన్స్ ను వేగవంతం చేసింది. ఈ సందర్భంగా డైరెక్టర్ పృథ్వీరాజ్ సుకుమారన్ లూసీఫర్ సినిమాలోని ఓ సీన్ గురించి ఇంట్రెస్టింగ్ విషయాన్ని వెల్లడించారు. లూసీఫర్ సినిమాలో మోహన్ లాల్ ఎంట్రీ సీన్ ఆ సినిమాలోనే హైలైట్ గా నిలిచిందనే విషయం తెలిసిందే. ఆ సీన్ ను తాను సూపర్ స్టార్ రజినీకాంత్ స్ఫూర్తితో రాసుకున్నట్టు పృథ్వీరాజ్ తెలిపారు. రజినీకాంత్ గురించి తాను విన్న ఒక కథను స్ఫూర్తిగా తీసుకుని ఆ సీన్ ను తెరకెక్కించానని పృథ్వీ చెప్పారు. చెన్నైలో రజినీ ఉండే పోయెస్ గార్డెన్ వీధిలో ఎప్పుడూ ఎలాంటి పరిస్థితులుంటాయో ఓ వార్త చదివానని, అది చదివాక దాన్ని బేస్ చేసుకుని లూసీఫర్ లో మోహన్ లాల్ ఎంట్రీ సీన్ ను రాసుకున్నానని, మూవీలో ఆ సీన్ కు చాలా మంచి రెస్పాన్స్ వచ్చిందని ఆయన తెలిపారు. అయితే పృథ్వీరాజ్ సూపర్ స్టార్ రజినీకి చాలా పెద్ద ఫ్యాన్ అనే సంగతి సందర్భం వచ్చిన ప్రతీ సారీ చెప్తూనే వస్తున్నారు. ఎల్2: ఎంపురాన్ ట్రైలర్ ను కూడా పృథ్వీరాజ్ ముందుగా రజినీకే చూపించి ఆయన బ్లెస్సింగ్స్ తీసుకున్నానని, ట్రైలర్ చూశాక రజినీ చెప్పిన మాటల్ని తానెప్పటికీ మర్చిపోలేనని కూడా ట్వీట్ చేసిన పృథ్వీరాజ్ రజినీని ఎప్పుడెప్పుడు డైరెక్ట్ చేస్తానా అని వెయిట్ చేస్తున్నానని, గతంలో ఓసారి ఆ ఛాన్స్ వచ్చినప్పటికీ కొన్ని కారణాల వల్ల అది కుదరలేదని పృథ్వీరాజ్ అన్నారు.

# మద్యపానం..ధూమపానం చేయను!

: నటుడు సప్తగిరి కెరీర్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. అసిస్టెంట్ డైరెక్టర్ నుంచి నటుడిగా ప్రమోట్ అయి నేడు తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు దక్కించుకున్నాడు. కమెడియన్ గా, నటుడిగా రాణిస్తున్నాడు. అప్పుడప్పుడు సప్తగిరి ప్రధాన పాత్రల్లోనూ కొన్ని సినిమాలు తెరకెక్కుతున్నాయి. ఇండస్ట్రీకి ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా వచ్చి సక్సెస్ అయిన వాళ్లలో సప్తగిరి కూడా ఒకరు. 'పెళ్లికాని ప్రసాద్' అనే చిత్రంతో త్వరలో ప్రేక్షకుల ముందుకొస్తున్నాడు. అయితే ఈ సినిమా టైటిల్ కి తగ్గట్టే ఆయనకు ఇంకా నిజంగానే పెళ్లి కాలేదు. పెళ్లి ఎందుకు చేసుకోలేదు? అంటే 'చేసుకుందాం..చేసుకుందాం' అంటూనే ఇంతకాలం వాయిదా వేసానన్నారు. కానీ త్వరలోనే పెళ్లి వార్త చెబుతానని నవ్వేసాడు. అలాగే సప్తగిరి మిస్టర్ క్లీన్ మెన్ అంటున్నాడు. అతడికి ఎలాంటి చెడు అలవాట్లు..వ్యసనాలు లేవంటున్నాడు. మద్యపానం..దూమపానం అలవాట్లు లేవన్నాడు. తన మనసులో ఎప్పుడు మంచి ఆలోచనలే ఉంటా యని...రోజును చాలా ఫ్రెష్ గా మొదలు పెడతానన్నారు. నిత్యం, యోగా ధ్యానం చేస్తుంటాను. నా ఆలోచనలు, అలవాట్లే నన్ను ఎప్పుడు తృప్తిగా ఉంచుతాయి. హాస్య నటుడిగా ఎంతో మందిని నవ్విస్తున్నానే తృప్తి నాకెప్పుడు ఉంటుంది. చాలా మంది



అప్పటికప్పుడు దొరికితే అదే హ్యాపీనెస్ అనుకుంటారు. కానీ సంతోషం అనేది మాట్లాడితేనో...చూస్తేనో వచ్చేది కాదు. మంచి ఆలోచనలు, జాలి, దయ, కరుణ ఉన్నప్పుడు వాటితో వచ్చే సంతోషంగా వేరుగా ఉంటుంది. అలా ఓసారి ప్రయత్నిస్తే అందులో కిక్ తెలుస్తుంది. మనసు ప్రశాంతంగా ఉ ంటుంది. ఇతరుల జోలికి వెళ్లకుండా మన పని మనం చేసుకుంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు' అని అన్నారు.




# ఎస్ ఎస్ ఎంబీ 29 గురించి అలా అనుకుంటే పొరపాటేనా!



'బాహుబలి' నుంచి రాజమౌళి సినిమా షూటింగ్ లు పూర్తి చేసుకుని రిలీజ్ అవ్వడం అన్నది సంవత్స రాలు పడుతోన్న సంగతి తెలిసిందే. ఒక్కో ప్రాజెక్ట్ ని పూర్తి చేసి రిలీజ్ చేయడానికి ఎలా లేదన్నా రెండేళ్లు పడుతుంది. ఇంకా అంతకన్నా ఎక్కువ సమయమే తీసుకుంటారు. 'బాహుబలి' తర్వాత 'ఆర్ ఆర్ ఆర్' పట్టాలెక్కించడానికి...రిలీజ్ చేయడానికి కూడా చాలా సంవత్సరాలే సమయం పట్టింది. అయితే ఎస్ ఎస్ ఎంబీ 29 విషయంలో అంత సమయం పట్టదని ఏడాదిన్నరలోనే సినిమా అన్ని పనులు పూర్తి చేసుకుని రిలీజ్ అయిపోతుందని తొలి నుంచి జోరుగా ప్రచారం సాగుతుంది. అందుకు తగ్గట్టు రాజమౌళి వేసిన షెడ్యూల్స్ కూడా వేగంగా పూర్తవ్వడంతో ఇదంతా ఆ ప్రచారమంతా నిజమయ్యేలా ఉందంటూ అభిమానులు ఆశలు పెంచుకుంటున్నారు. హైదరాబాద్...ఒడిశా షెడ్యూల్స్ చాలా వేగంగా పూర్తి చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈసారి మాత్రం రిలీజ్ అనుకున్న సమయానికి వచ్చేస్తుందని భావిస్తున్నారు. కానీ ఈ ప్రాజెక్ట్ ఎంత పెద్దది? అని అంచనా వేయగలిగేది ఎంత మంది. ఈ సినిమాతో రాజమౌళి పాన్ వరల్డ్ మార్కెట్ పైనే గురి పెట్టాడు. ఎన్టీఆర్, చరణ్, ప్రభాస్ తోనే పాన్ ఇండియాని ఊపేసారు. అలాంటి జక్కన్న దృష్టిలో మహేష్ ఇమేజ్ తో పాన్ వరల్డ్ తప్ప మరో ఆలోచన లేదు ? అన్నది కాదనలేని నిజం. విజయేంద్ర ప్రసాద్ పాన్ వరల్డ్ మార్కెట్ ని దృష్టిలో పెట్టుకుని రాసిన కథ అని ఇప్పటికే లీకులం దుతున్నాయి. రెండు భాగాలుగానూ తెరకెక్కిస్తున్నారు అని వినిపిస్తుంది. అలాంటప్పుడు మొదటి భాగాన్ని ఏడాదిన్నరలో అన్ని పనులు పూర్తి చేసి రిలీజ్ చేయడం అన్నది అసాధ్యమంటున్నారు. సినిమా రిలీజ్ కి రెండేళ్లకు పైగానే సమయం పడుతుందని తాజా సమాచారం.

# వైష్ణవి చైతన్యతో సిద్ధు.. ఓ ముద్దు

స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'జాక్' ప్రేక్షకుల్లో భారీ అంచనాలు క్రియేట్ చేస్తోంది. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు 'కొంచెం క్రాక్' అనే క్యాచీ ట్యాగ్ లైన్‌తో మరింత ఆసక్తి పెంచుతున్నారు. వైష్ణవి చైతన్య హీరోయిన్‌గా నటిస్తుండగా, శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై బివిఎస్ ఎన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ కానున్న ఈ సినిమా ప్రమోషన్స్ వేగంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో తాజాగా 'జాక్' నుంచి 'కిస్ సాంగ్' విడుదలైంది. ఇక హైదరాబాద్ లోనే ఈ లిరికల్ సాంగ్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. విడుదలైన క్షణాల్లోనే ఈ సాంగ్ ట్రెండింగ్‌లోకి ఎక్కింది. ఇప్పటికే టీజర్‌కు సూపర్ రెస్పాన్స్ రావడంతో, ఇప్పుడు 'కిస్ సాంగ్' సినిమాపై మరింత హైప్ క్రియేట్ చేసింది. పాటకు సంబంధించిన పోస్టర్ కూడా ఆకట్టుకుంటోంది. సాంగ్ విషయానికి వస్తే, 'జాక్' తన ప్రేయసితో ఓ ముద్దు కోసం ప్రైవసీగా ఉండే చోటు వెతుకుతున్నట్లు కనిపిస్తోంది. ఆ వేదికగా ఓ సినిమా థియేటర్‌ను ఎంచుకున్నట్లు అర్థమవుతోంది. అల్లరి టచ్‌తో కూడిన ఈ రొమాంటిక్ మెలొడీ పాట యువతను బాగా ఆకట్టుకునేలా ఉంది. సిద్ధు-వైష్ణవి కెమిస్ట్రీ హైలైట్‌గా నిలిచింది. సురేష్ బొబ్బిలి సంగీతం అందించగా, సనోరే లిరిక్స్ అందించారు. జావేద్ అలీ, ఆమల చెబోలు గాత్రం ఈ పాటకు ప్రత్యేకమైన అందం తెచ్చిపెట్టింది.పాట విజువల్స్ పరంగా స్టైలిష్‌గా, కలర్ ఫుల్‌గా కనిపిస్తోంది. రాజు సుందరం కొరియోగ్రఫీని సమకూర్చిన ఈ పాటలో సిద్ధు యాక్టింగ్ సహజంగా ఉంది. వైష్ణవి చైతన్య లుక్స్ మరో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. థియేటర్ బ్యాక్‌డ్రాప్‌లో క్యాప్చర్ చేసిన లొకేషన్స్ కూడా మంచి ఫీల్‌ను అందించాయి. మొత్తానికి, 'కిస్ సాంగ్' లవ్ అండ్ ఫన్ టచ్‌తో సినిమాపై క్యూరియాసిటీ పెంచింది. ఏప్రిల్ 10న రాబోతున్న 'జాక్' సినిమా ఎలా ఉంటుందో చూడాలి. ఇక జాక్ సినిమా కేవలం రొమాంటిక్ లవ్ స్టోరీ గానే కాకుండా ఒక హై వోల్టేజ్ యాక్షన్ టచ్ కూడా ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. బొమ్మరిల్లు భాస్కర్ కంప్లీట్ గా తన స్టైల్ కు భిన్నంగా తెరకెక్కిస్తున్నట్లు అర్థమవుతుంది. సినిమాకు సంబంధించిన అన్ని పనులు ముగిశాయి. ఇక రిలీజ్ డేట్ విషయంలో మార్పులు చేసే ఆ అవకాశం ఉన్నట్లు ఆమధ్య టాక్ వచ్చింది. కానీ అందులో నిజం లేదు. ప్రస్తుతం మేకర్స్ పక్కా ప్రణాళికతో అనుకున్న సమయానికి ప్రేక్షకుల ముందుకు ఈ సినిమాను తీసుకు వస్తున్నారు.




# రష్మికను అందుకోవడం మిగిలిన వారికి కష్టమే

కిరిక్ పార్టీ సినిమాతో కెరీర్ ను మొదలుపెట్టిన రష్మిక అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్ గా ఎదిగింది. టాలీవుడ్ లోని స్టార్ హీరోలందరితో కలిసి నటించిన రష్మిక నేషనల్ క్రష్ గా మారి దేశమంతా తన గురించి మాట్లాడుకునేలా చేసింది. తన అందం, నటనతో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్న రష్మిక అశేషమైన క్రేజ్ ను సొంతం చేసుకుంది. నేషనల్ వైడ్ లో ప్రస్తుతం రష్మికకు ఉన్న క్రేజ్ మరే హీరోయిన్ కు లేదు. అమ్మడు ఈ మధ్య పట్టిందల్లా బంగారమే అవుతుంది. తాను నటించిన ప్రతీ సినిమా ఎంతో క్రేజ్ తెచ్చుకోవడంతో పాటూ బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తున్నాయి. అందుకే ఇప్పుడు రష్మిక అందరికీ లక్కీ హీరోయిన్ గా మారిపోయింది. ప్రస్తుతం రష్మిక ఇండియన్ సినిమా క్వీన్ గా ఓ వెలుగు వెలుగుతోంది.రష్మిక ఏ ముహూర్తాన పుష్ప సినిమా చేసిందో కానీ ఆ సినిమా తర్వాత నుంచి తన కెరీర్ గ్రాఫ్ అమాంతం పెరిగిపోయింది. పుష్ప నేషనల్ వైడ్ సక్సెస్ అయింది. ఆ తర్వాత బాలీవుడ్ లో చేసిన యానిమల్ మూవీ కూడా బాక్సాఫీస్ వద్ద వండర్స్ సృష్టించింది. ఇక పుష్ప2 గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. బ్యాక్ టు బ్యాక్ సక్సెస్ లతో దూసుకెళ్తున్న రష్మిక రీసెంట్ గా బాలీవుడ్ లో చేసిన ఛావా సినిమా కూడా భారీ బ్లాక్ బస్టర్ గా నిలిచిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే రష్మిక నుంచి తర్వాత రాబోయే సినిమాలపై బజ్ అమాంతం పెరిగిపోయింది. బ్యాక్ టు బ్యాక్ సక్సెస్ లతో దూసుకెళ్తున్న రష్మిక నుంచి త్వరలోనే సికిందర్ మూవీ వస్తోంది. సల్మాన్ ఖాన్ హీరోగా మురుగదాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాకు రష్మిక సెంటిమెంట్ కలిసొస్తుందని సల్మాన్ ఫ్యాన్స్ భావిస్తున్నారు. సికిందర్ తో పాటూ రష్మిక చేతిలో పలు ప్రాజెక్టులున్నాయి. వాటిలో శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్, నాగార్జున కీలక పాత్రల్లో తెరకెక్కుతున్న కుబేర ఒకటి. అది కాకుండా రష్మిక ప్రధాన పాత్రలో నటించిన గర్ల్‌ఫ్రెండ్ మూవీ రిలీజ్ కు రెడీ అవుతోంది.



Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal, RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**